తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## అమ్మవారి ఉత్సవంలో అపశృతి



ఓజిలి, జూన్ 2, ప్రభాతవార్త
ఓజిలి మండలంలోని ఆరిమేనిపాడులో జరుగుతున్న ముంగమారి పరమేశ్వరి అమ్మవారి ఉత్సవంలో సోమవారం అపశృతి చోటుచేసుకుంది. అమ్మవారి ఊరేగింపులో విద్యుత్ షాక్ తగిలి ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు స్థానికులు తెలిపారు. నిర్వాహకులు నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగిందని బాధితుల కుటుంబాలు ఆరోపిస్తున్నారు. పనబాక గౌరీ,నాగూర్ పనబాక బోసు, రఘుపతి, ఒకే కుటుంబానికి చెందిన వారు ప్రమాదాల గాయపడిన వారు నెల్లూరు అపోలో హాస్పిటల్లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఓజిలి ఎస్ఐ స్వప్న సంఘటన స్థలము చేరుకొని కేసు నమోదు చేసి ప్రమాదని గల కారణాలు అడిగి తెలుసుకున్నారు.

## పద్మావతిపురం ప్రధాన రహదారిలో కారు దగ్ధం



తిరుపతిరూరల్, జూన్ 2 ప్రభాతవార్త:
పద్మావతిపురం ప్రధాన రహదారి కారు దగ్ధం కావడంతో దట్టమైన పొగ అలుముకుంది. తమిళనాడు నుంచి తిరుమలకు నాలుగు చక్రాల బ్యాటరీ వాహనంలో తిరుమలకు వచ్చినట్లు సమాచారం. బ్యాటరీ ఒక్కసారిగా కాలిపోవడంతో మంటలు చెలరేగాయి. అందులో ప్రయాణిస్తున్న 6మంది భక్తులు సురక్షితంగా బయటపడ్డినట్లు స్థానికుల సమాచారం. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలు అర్పే ప్రయత్నం చేసారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# మామిడి రైతుకు గిట్టుబాటు ధరేది!

**టన్ను రూ.20 వేలకు బెర్నిషా, రూ.7 వేలకు తోతాపురి అమ్మకాలు**
**- ప్రాసెసింగ్ యూనిట్లకు ఈ సీజన్‌లో అందని అర్డర్లు- ఇంకా కొలిక్కి రాని తోతాపురి ధర ఖరారు**

చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త:
మామిడి సీజన్ ప్రారంభం కావడంతో జిల్లా మామిడి రైతుల గుండెల్లో డేంజర్ బెల్స్ మోగుతున్నాయి. జిల్లాలో గత ఏడాది మామిడి దిగుబడి తక్కువగా వున్నప్పటికీ రైతుకు ఆశించిన గిట్టుబాటు ధర లభించలేదు. గత ఏడాది మామిడి ధర రైతుకు పెద్దగా లాభాలు లేకపోయినా నష్టపోకుండా చేసింది. అయితే ఈ ఏడాది జిల్లాలో మామిడి దిగుబడి అధికంగా వుండటం, ఇతర జిల్లాల నుండి సైతం మామిడి జిల్లాకు ఎక్కువగా దిగుబడి అయ్యే అవకాశం వుండటంతో ఈ సారి గత ఏడాది ధర కంటే మామిడి ధరలు విపరీతంగా తగ్గుముఖం పట్టే అవకాశం కన్పిస్తోంది. జిల్లాలో ఇప్పటికే మామిడి సీజన్ ప్రారంభమైనప్పటికీ టేబుల్ వెరైటీ అయిన బెర్నిషా మార్కెట్‌లో ప్రస్తుతం టన్ను 20 వేల రూపాయల వరకు పలుకుతుంది. గత ఏడాది బెర్నిషా రకం మామిడి ఒక టన్ను ధర 35 వేల రూపాయల వరకు పలికింది. అంటే టేబుల్ వెరైటీ మామిడిలో రైతుకు ఈ సీజన్‌లో గత సీజన్ కంటే తక్కువ ధరలు లభ్యం కానున్నాయి. ఇక జిల్లాలో మెజార్టీ శాతం సాగు అయ్యే తోతాపురి మామిడి ధర ఇప్పటికీ ఖరారు కాలేదు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా తోతాపురి రకం మామిడి కాయలను ప్రాసెసింగ్ చేసి విదేశాలకు ఎగుమతి చేయడానికి 47 ప్రాసెసింగ్ యూనిట్లు వున్నాయి. ఈ ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులకు ప్రతి ఏడాది సీజన్ ప్రారంభానికి నాలుగు నెలల ముందే విదేశాల నుండి అర్డర్లు వచ్చేవి. ఈ మేరకు ప్రాసెసింగ్ యూనిట్ యాజమానులకు విదేశాల నుండి ప్యాకింగ్ మెటీరియల్ సైతం వస్తుండటంతో ఇక్కడి ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులు ధైర్యంగా తోతాపురి మామిడి కొనుగోలు చేసి దానిని ప్రాసెసింగ్ చేసే విదేశాలకు ఎగుమతి చేసేవారు. అయితే గత ఏడాది ప్రాసెసింగ్ యూనిట్లకు విదేశాల నుండి ఆశించిన వ్యాపారం జరుగలేదు. దాంతో గత సీజన్‌లో



ప్రాసెసింగ్ యూనిట్లు తయారు చేసిన పల్ప్‌ను సైతం ఫ్యాక్టరీలు ఎగుమతి చేయలేక పోవడంతో ఆ పల్ప్ ప్రస్తుతం అలాగే ఫ్యాక్టరీల వద్ద నిల్వ వున్నాయి. తమ వద్ద గతంలో తయారు చేసిన పల్ప్ నిల్వలు సిద్ధంగా వుండటంతో ఈ సీజన్‌లో తాము పల్ప్ పెద్ద ఎత్తున చేపట్టే అవకాశం లేదని కొన్ని పల్ప్ ఫ్యాక్టరీలు పేర్కొంటున్నాయి. సాధారణంగా తమకు విదేశాల నుండి అర్డర్ రావడంతో పాటు నిల్వ చేయడానికి అవసరమైన మెటీరియల్‌ను సైతం విదేశాల్లోని సంస్థలు పంపుతుండటంతో ఇక్కడి తాము పల్ప్ సిద్ధం చేసి స్టాకు నిల్వ వుంచుతామని, ప్రస్తుతం తాము పల్ప్ చేయడానికి మెటీరియల్ సైతం లేని పరిస్థితి నెలకొందని యాజమానులు పేర్కొంటున్నారు. జిల్లాలో పల్ప్ ఫ్యాక్టరీలకు ఉపయోగించే తోతాపురి రకం మామిడి ధర ఇంకా ఖరారు కాలేదు. గత సీజన్‌లో ఒక టన్ను 25 వేల నుండి 30 వేల రూపాయల వరకు తోతాపురి మామిడి ధర పలికింది. ప్రస్తుతం ఒక టన్ను 8 వేల నుండి 10 వేల రూపాయల వరకు తోతాపురి రకం మామిడి మార్కెట్‌లో పలుకుతుంది. ఈ ధర ఏ మాత్రం గిట్టుబాటు లేదని రైతులు వాపోతున్నారు. ఒక నెల రోజుల నుండి తోతాపురి రకం మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేస్తూ రైతులు ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. ఈ విషయంపై కలెక్టర్ సుమిత్‌కుమార్ ప్రాసెసింగ్ యూనిట్ల యాజమానులు, రైతులతో కలిసి పలుమార్లు సమావేశం అయ్యారు. అయినప్పటికీ తోతాపురి రకం మామిడి ధర ఖరారు కాలేదు. రెండు రోజుల్లో తోతాపురి రకం మామిడి ధరను ప్రభుత్వం నిర్ణయిస్తే జిల్లాలో ప్రాసెసింగ్ యూనిట్లు సైతం తోతాపురి రకం మామిడి ప్రాసెసింగ్‌ను ప్రారంభించడానికి సిద్ధం అయ్యే అవకాశం వుంది. ఎమైనప్పటికీ ప్రాసెసింగ్ యూనిట్లు గత సీజన్‌తో పోల్చితే తక్కువ మొత్తంలో ప్రాసెసింగ్ చేసే అవకాశం వుంది. జిల్లాలో 1.14 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో మామిడి సాగు అవుతుండగా ఒక సీజన్‌లో దాదాపుగా 16 లక్షల టన్నుల మామిడి ఉత్తత్తి అవుతుంది. ఇందులో 2 నుండి 3 లక్షల టన్నుల మామిడి టేబుల్ వెరైటీలు కాగా మిగిలి 14 నుండి 13 లక్షల టన్నుల మామిడి తోతాపురి రకం వుంటుంది. ఈ మొత్తం తోతాపురి మామిడిని ప్రాసెసింగ్ చేయడానికి అనుగుణంగా జిల్లాలోని యూనిట్లు లేవు. ఈ పరిస్థితుల్లో ఇతర జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుండి సైతం ఇక్కడ లభ్యం అవుతున్న ధర కంటే తక్కువ ధరకు తోతాపురి మామిడి ఫ్యాక్టరీ యాజమానులకు అందుతుంది. తక్కువ ధరకు తోతాపురి రకం మామిడి లభ్యం అయితే ఫ్యాక్టరీ యాజమానులు జిల్లాలో సాగు అయిన తోతాపురి మామిడిని ప్రక్కన పెట్టి ఇతర రాష్ట్రాలు, జిల్లాల నుండి వచ్చిన మామిడిని కొనుగోలు చేసే అవకాశం వుంటుంది. ఇదంతా తోతాపురి రకం మామిడికి ధర అధికంగా వున్నప్పుడు ఇప్పుడు ధర తక్కువగా వుండటంతో ఏం జరుగుతుందనేది రెండు మూడు రోజుల్లో తేలనుంది.

# గోవిందరాజుని బ్రహ్మోత్సవాలు ఆరంభం

**ఉదయం ధ్వజారోహణం - రాత్రి పెద్దశేషవాహనం**





తిరుపతి,జూన్ 2ప్రభాతవార్త :
తిరుపతి శ్రీగోవిందరాజస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఉదయం ధ్వజారోహణంతో మొదలయ్యాయి. మిధున లగ్నంలో వేదపండితుల మంత్రోచ్చరణలు, మంగళవాయిద్యాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ గరుడచిత్రంతో కూడిన ధ్వజపటాన్ని ధ్వజస్తంభంపై ప్రతిష్టించారు. అనంతరం ఉదయం 10గంటలకు కల్యాణమండపంలో స్వామివారికి అమ్మవార్ల ఉత్సవర్లకు విశేష స్నపతిరుమంజనం నిర్వహించారు. రాత్రి తొలివాహనంగా పెద్దశేషునిపై గోవిందరాజస్వామి ఊరేగి భక్తులకు అభయమిచ్చారు. ఈ కార్యక్రమాల్లో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ విఆర్ శాంతి, ఎఈఓ మునికృష్ణారెడ్డి, శ్రీవారిసేవకులు, అర్చకులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దాం

**ఎమ్మెల్సీ మేరిగ మురళిధర్**



కోట.4 మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మురళిధర్

కోట,జూన్ 2 ప్రభాతవార్త
గూడూరు నియోజకవర్గం కేద్రంలో ఈ నెల 4న నిర్వహించే వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేద్దామని ఎమ్మెల్సీ మేరిగమురళిధర్ పిలుపు నిచ్చారు. సోమవారం మండల పరిధిలోని విద్యా నగర్‌లోని నేదురుమల్లిసుబ్బారామిరెడ్డి కళాభవన్‌లో మండల స్థాయిలో జరిగిన కార్యకర్తల సమా వేశం లో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్ప డ్డాక ప్రజలకిచ్చిన హామీలను నేరవేచ్చ లేదన్నారు. ఈ మేరకు తమ పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పలిపు మేరకు వెన్నుపోటు దినానికి మండలం లోని ప్రతి పంచా యతీ నుంచి వందలాది మంది తరలి రావాలని ఆయన కోరారు.ఈ సమావేశంలో మండల కన్వీనర్, పలగాటి సంపత్ కుమార్ రెడ్డి, ఎంపిపి దాసరి అంజమ్మ జెట్పి టిసి సభ్యులు దాసరికోటయ్య,సిద్దవరం సొసైటి మాజీ చైర్మెన్, సన్నారెడ్డి చెంచురారాఘవరెడ్డి, పుచ్చలపల్లి జల సంఘం మాజీ అధ్యక్షులు, దూవ్వూరు వెంకట రమణారెడ్డి, సెంట్రల్ బ్యాంక్ మాజీ డైరెక్టర్, నర మాల వెంకటరమణయ్య, వైకాపా పంచా యతీ రాజ్ ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి. చిట్టమూరు మండల వైకాపా కన్వీనర్, శ్రీనివాసు లురెడ్డి,మండల ఆర్గనైజర్ పాముల సురేంద్ర, మాజీ జెడ్పిటీసీ సభ్యులు ఉప్పల ప్రసాద్ గౌడ్,తదితరులు పాల్గొన్నారు.

# రోజువారి దినచర్యల్లో యోగా తప్పనిసరి

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

పెనుమూరు, జూన్ 2 ప్రభాతవార్త:
యోగాను రోజువారి దినచర్యల్లో ఒక భాగంగా తీసుకోవడం ద్వారా అనారోగ్య సమస్యలు రావని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. పెనుమూరు మండలం పులిగుండు వద్ద సోమవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్రా కార్యక్రమంలో భాగంగా జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన యోగాంధ్రా కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు ముఖ్య అతిధులుగా హాజరై యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో మే 21 నుండి జూన్ 21వ తేదీ వరకు యోగాంధ్రా-2025 కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. పర్యాటక ప్రాంతాల్లో యోగాపై అవగాహన కల్పించడానికి ఇది వరకే పర్యాటక కేంద్రమైన కాణిపాకం దేవస్థానంను సమన్వయం చేసుకుని యోగాంధ్రా కార్యక్రమంను నిర్వహించడం జరిగిందన్నారు. పులిగుండు యోగాంధ్రా కార్యక్రమంలో 2,300 మంది పాల్గొని విజయవంతం చేశారన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు సుమారు 2.5 లక్షల మంది యోగాంధ్రా-2025లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. ప్రతిరోజు ఒక అర్ధగంట రోజు వారి ప్రణాళికలో ప్రతి ఒక్కరు యోగాను చేస్తే మానసిక ఒత్తిడి తగ్గుతుందన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు యోగా ప్రాధాన్యతను తెలుసుకోవడానికి ప్రభుత్వం ఒక నెల రోజుల పాటు గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో యోగ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల్లోపు ఎండలో వుండటం ద్వారా డి విటమిన్ అందుతుందని, మంచి అలవాట్లతో పాటు యోగాను నేర్చుకుంటే మరింత ఆరోగ్యకరంగా వుంటారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి గౌరి, డిఆర్‌డిఎ పిడి శ్రీదేవి, డిఎస్‌డిఓ బాలాజీ, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, మహిళలు, ఎస్వీ సెట్ మెడికల్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.



పులిగుండు ఆవరణలో జరిగిన యోగాంధ్రా కార్యక్రమంలో యోగాసనాలు చేస్తున్న కలెక్టర్

## దళిత విద్యార్థిపై దాడికేసులో 12 మంది ముద్దాయిలు అరెస్ట్

తిరుచానూరు, జూన్ 2, ప్రభాతవార్త :
దళిత విద్యార్థి పై దాడి చేసిన ముద్దాయిలను తిరుచానూరు పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుచానూరు పోలీస్ స్టేషన్ సిఐ సునీల్ కుమార్ సమాచార మేరకు గత కొన్ని రోజుల క్రితం దళిత విద్యార్థి పై దాడి సంబంధిత కేసు సంచలనగా మారిన విషయం విధితమే. ఈ క్రమంలో తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు సబ్ డివిజన్ డిఎస్పి ప్రసాద్, తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందం ఏర్పాటు చేశారు. డీఎస్పీ ఆధ్వర్యంలోని ఈ బృందం దళిత విద్యార్థిపై దాడి చేసిన దుండగులను రిక్షా కాలనీ, మంగళం, బొమ్మల క్వార్టర్స్ కోటర్సులో దాగి ఉన్న ముద్దాయిలను పక్క



సమాచారంతో అరెస్టు చేశారు. యశ్వంత్, గోపాల్, కిరణ్ రెడ్డి మొదలగు 12 మంది ముద్దాయిలను అరెస్టు చేశారు. మిగిలిన వారిని త్వరలోనే అరెస్టు చేస్తామని పోలీసులు తెలిపారు. అనంతరం దళిత విద్యార్థి పై దాడికి పాల్పడిన వారిని త్వరతగతిన అరెస్టు చేసిన తమ పోలీసు సిబ్బందిని తిరుపతి ఎస్పి హర్షవర్ధన్ రాజు అభినందించారు. అదేవిధంగా పాత్రికేయులతో ఎస్పీ మాట్లాడుతూ విద్యార్థులు గ్రూపులుగా ఏర్పడి ఒకరిపై ఒకరు దాడులకు పాల్పడితే చట్టపరమైన శిక్షలకు బాధ్యులు కాగలరని హెచ్చరించారు. అలాగే బయట వ్యక్తులు విద్యార్థులను తమ గొడవలకు లాగాలని చూస్తే వారి నేరచరిత్రను పరిగణలోకి తీసుకుని తీవ్రమైన చర్యలకు పాల్పడతామని హెచ్చరించారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించండి : కలెక్టర్

**- పీజీఆర్ఎస్‌కు 299 అర్జీలు**
**- ఆన్‌లైన్ చేయడంలో ఆలస్యం...కంప్యూటర్ సిబ్బంది విభాగం వద్ద గందరగోళం**



తిరుపతి కలెక్టరేట్, జూన్ 2 ప్రభాతవార్త :
రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నాణ్యతతో పరిష్కారం చూపి మానవతా దృక్పథంతో వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి బాధితులు, అర్జీదారులు, ఫిర్యాదు దారుల నుంచి 299 అర్జీలను జిల్లా కలెక్టర్‌తో పాటు జేసీ శుభం బన్సల్,డీఆర్వో నరసింహులు, డెప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, సుధారాణి, రోజ్ మాండ్ అర్జీలను స్వీకరించారు. అయితే అర్జీలను ఆన్‌లైన్ చేయడంలో ఆలస్యం కావడంతో కంప్యూటర్ సిబ్బంది విభాగం ముందు గుంపులు, గుంపులుగా ఏర్పడడంతో కాస్త గందర గోల పరిస్థితి ఏర్పడింది. దీనిపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి పెట్టి అర్జీదారులు, ఫిర్యాదుదారులకు, బాధితులకు సులభతరంగా అర్జీలు ఆన్‌లైన్ అయ్యే విధంగా కంప్యూటర్ సిబ్బందిని ఇంకా కాస్త పెంచి నెట్ పూర్తి స్థాయిలో పనిచేసే విధంగా చూడాలని బాధితులు, అర్జీదారులు, ఫిర్యాదుదారులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పిల్లలు బరువు తగ్గకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త:
పిల్లలు బరువు తగ్గకుండా వారికి అంగన్‌వాడీల ద్వారా సరైన పౌష్టికాహారం అందించడానికి పక్కాగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎ.సూర్యకుమారి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో సోమవారం రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌళిక సౌకర్యాల కల్పనకు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలన్నారు. పంచాయతీరాజ్ శాఖ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు అప్రోచ్ రోడ్డు వేయాలన్నారు. చిత్తూరు జిల్లా తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల సరిహద్దులో వుండటంతో సరిహద్దు రాష్ట్రాల అధికారులను సమన్వయం చేసుకుని బాల్య వివాహాలు జరుగకుండా పక్కాగా కట్టడి చేయాలన్నారు. అలాగే కిషోర వికాసం ద్వారా కౌమార దశలో గర్భం దాల్చడంపై వచ్చే ఆరోగ్య, ఆర్థిక





అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో కలిసి సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న స్త్రీ శిశు సంక్షేమశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి.

సమస్యలను కిషోర బాలబాలికలకు వివరించాలన్నారు. అలాగే మేనరికం వివాహల వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లు క్రమం తప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన మౌళిక వసతుల వివరాలను మండలాల వారీగా పంపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల బరుడు, ఎత్తులను కచ్చితత్వంతో కొలవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను తాను అకస్మిక తనిఖీలు చేస్తానన్నారు. అంగన్‌వాడీల్లో తక్కువ బరువు వున్న పిల్లలకు కారణాలను అధికారులను పరిశీలించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సిబ్బంది ఖాళీలను భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే సిడిపిఓలు, సూపర్‌వైజర్ల పనితీరును తనిఖీ చేస్తామన్నారు. జిల్లాలో పురుషులతో పోల్చితే స్త్రీల జనాభా తక్కువగా వుందని, లింగ నిర్ధారణ పరీక్షలు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 410 ఔమార గర్భాలు నమోదు అయ్యాయని, దీనికి అరికట్టడానికి సిడిపిఓలు, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పని చేయాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో ఐసిడిఎస్ పిడి వెంకటేశ్వరీ, డిఎంహెచ్ఓ డాక్టర్ సుధారణి, సాంఘీక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ చెన్నయ్య, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ విజయకుమార్, మహిళా పోలీస్ ఎస్ఐ నాగసౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

## సత్వరం సమస్యలు పరిశీలించి పరిష్కారం: కలెక్టర్



చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త:
ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలను సత్వరం పరిశీలించి పరిష్కరించాలని కలెక్టర్ సుమి త్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని నూతన సమావేశభవనంలో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరిలు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ గ్రీవెన్స్‌డేలో ప్రజల నుండి సమస్యలపై అందిన అర్జీలపై అధికారుల ప్రత్యేక శ్రద్ధ పెట్టి పని చేయాలని, ప్రతి అర్జీకి అర్ధవంతమైన సమాధానం ఇస్తూ పరిష్కారం చూపాలన్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 275 సమస్యల అర్జీలు వచ్చాయి. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీఓ శ్రీనివాసులు, డిప్యుటీ కలెక్టర్లు విజయలక్ష్మి, అనుపమలు హాజరై ప్రజల నుండి సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు.

## రేపటినుంచి వేరుసెనగ విత్తనాలు పంపిణీ

కుప్పంరూరల్, జూన్ 2 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రాయితీతో అందించే వేరుసెనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం ఈనెల 4వతేది ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయాధికారి ఫయాజ్ బాషా తెలిపారు. 30కిలోల విత్తనాల పూర్తి ధర రూ 2790కాగా ప్రభుత్వ రాయితీ రూ 1116 పోను రైతులు బస్తాకు రూ 1674లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. మండలానికి ప్రస్తుతం 845.7క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో వచ్చాయన్నారు. మరో 500క్వింటాళ్ల విత్తనాలు మంజూరుకు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ ద్వారా ప్రతిపాదనలు పంపామన్నారు. కాగా గతేడాదితో పోల్చితే విత్తనాల బస్తా ధర రూ 36లు తగ్గింది.

## రైతులకు అందుబాటులో పండు ఈగ ఎరబుట్టలు

శాంతిపురం, జూన్ 2 ప్రభాతవార్త

ప్రస్తుతం మామిడితోటల్లో పండు ఈగ ఉధృతి అధికమైన నేపథ్యంలో దీని నివారణకు ఉద్యానవన శాఖ ద్వారా రైతులకు పండు ఈగ ఎర బుట్టలను రాయితీతో అందిస్తున్నట్లు ఉద్యానవన అధికారి వింధ్య తెలిపారు. ఎకరాకు 8 చొప్పున ఒక బుట్ట మరియు మూడు ఎరలను రాయితీతో 11రూ.లకుఅందిస్తున్నట్లు చెప్పారు. శాంతిపురం, గుడుపల్లె మండలాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎర బుట్టలు అవసరమైన రైతులు ఆధార్ నకలు, పాస్‌పుస్తకం నకలుతో రైతు సేవా కేంద్రంలో సంప్రదించాలని ఆమె కోరారు.

## ద్రవిడ వర్సిటీ..వన్‌ఎంవన్‌బి సంస్థల మధ్య ఒప్పందం

కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త



ద్రవిడ విశ్వవిద్యాలయం, వన్‌మిలియన్ ఫర్ వన్ బిలియన్ సంస్థల అధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగావకాశాల విస్తరణకై ఒప్పందం జరిగింది. సోమవారం వర్సిటీలో ఉప కులపతి ఆచార్య దొరస్వామి, వన్‌ఎంవన్‌బి సంస్థ ప్రభుత్వఅనుసంధాన కర్త దీపికా వెంకటేష్‌లు ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. ఈసందర్భంగా విసి మాట్లాడుతూ ఈభాగస్వామ్యం సమకాలీన అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను భవిష్యత్తు సవాళ్లకు సిద్ధం చేసే చారిత్రక అడుగు అని పేర్కొన్నారు.రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, అకడమిక్ డీన్ ఆచార్య శ్యామల పాల్గొన్నారు.

## మహిళపై దాడి కేసులో 8మందిపై కేసు నమోదు

శాంతిపురం, జూన్ 2 ప్రభాతవార్త

మండలంలోని మఠం పంచాయతీ వెంకటేష్‌పురంలో జరిగిన భూతగాదాల వ్యవహారంలో మహిళపై దాడి చేసిన సంఘటనలో సుమారు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్లు డిఎస్పీ పార్థసారథి, సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామానికి చెందిన పార్వతమ్మ, సల్లాపురి కుటుంబీకుల మధ్య భూ తగాదా నెలకొంది. ఈ నేపథ్యంలో ఘర్షణ చోటు చేసుకుంది. పార్వతమ్మపై సల్లాపురి అతని కుటుంబీకులు దాడికి దిగారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రశాంత వాతావరణంకు ప్రజలు సహకరించాలని కోరారు.

## వడివడిగా హంద్రీనీవా అడుగులు

పాకాల, జూన్ 2, ప్రభాతవార్త



పాకాల మండలం దామలచెరువు మీదుగా వెళ్లే హంద్రీనీవా కాలువ పనులలో కదలిక మొదలైనది. అన్నదాతలకు సాగునీరు పరిసర ప్రాంతాలలోని ప్రజలకు త్రాగు నీటిని తరలించేందుకు దశాబ్దాల నాటి క్రితం తవ్వి అసంపూర్ణంగా వదిలివేసిన హంద్రీనీవా కాలువ పనులు మరలా మొదలైనట్లు తెలుస్తోంది. దామలచెరువుకు దగ్గరలో అసంపూర్ణంగా వదిలివేసిన కాలువ పనులను తిరిగి చేపట్టడం ఇప్పుడు మండలంలోని రైతులకు సాగుపై నూతన ఉత్తేజాన్ని నింపుతున్నది. కాలువ పనులు త్వరితగతిన పూర్తిచేసి తమ పొలాలకు నీరు అందిస్తారు అని రైతులు ప్రజలు ఎదురుచూస్తున్నారు. మరి పనులు పూర్తి కావడానికి ఎంత కాలం పడుతుందో వేచి చూడాలి మరి.

## శ్రీతిరుపతి గంగమ్మను దర్శించుకున్న కడ పి.డి. కుటుంబీకులు



**కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త** కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారిని సోమవారం సాయంత్రం కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆయన కుటుంబీకులు దర్శించుకున్నారు. ఆలయం వద్ద పి.డి.కి ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం పి.డి. కుటుంబీకులు అమ్మవారిని దర్శించుకోగా ఛైర్మన్ అమ్మవారి తీర్థ ప్రసాదాలు, వస్త్రాలను అందించారు. మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, కమిటీ సభ్యులు జయరాంనాయుడు, నరేష్, ఆనంద్ పాల్గొన్నారు.

## 4.97లక్షల సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



***రామకుప్పం, జూన్ 2 ప్రభాతవార్త*** మండలంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి ప్రభుత్వం మంజూరు చేసిన 4.97లక్షల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఆరుమందికి సోమవారం మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర నేతలు మునస్వామి, పత్ర నారాయణ అందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పం ప్రజల ఆరోగ్యంపై సిఎం చంద్రబాబునాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకటరామగౌడు, నేతలు మునిరెడ్డి, రఫీ, మనోహర్, కామరాజనాయక్, జయశంకర్, పెరుమాళ్, వెంకటాచలం,విజయకుమార్‌రెడ్డి, నియాజ్, అక్బర్, బాలరాజు, సుబ్రి, శ్రీనాథ్‌రెడ్డి, ఆదిల్, సుబ్రమణ్యం, బాబు పాల్గొన్నారు.

## విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి



***రామకుప్పం, జూన్ 2 ప్రభాతవార్త*** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ జడ్పీటిసి మునస్వామి సూచించారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. పాఠశాలల పున: ప్రారంభం నుంచి సన్నబియ్యంను ప్రభుత్వం సరఫరా చేస్తుందని ఆహారం సైతం నాణ్యతతో అందించాలని వారు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వెంకటరామగౌడు, నేతలు పత్ర నారాయణ, రఫీ, కామరాజనాయక్, రాజేంద్ర, బిజెపి నేతలు రాజసింహ, నాగరాజు, జనసేన పవన్, ఎంఇఓ 2 నారాయణ పాల్గొన్నారు.

## అభివృద్ధికి సహకారం : ఎంపిపి



**శ్రీరంగరాజపురం, జూన్ 2 ప్రభాతవార్త:** మండల సర్వతోముఖాభివృద్ధి కోసం పార్టీలకు అతీతంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు పూర్తి సహకారం అందించాలని ఎంపిపి సరిత పిలుపునిచ్చారు. ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఎంపిపి సరిత అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఎంపిపి సరిత శాఖల వారీగా జరిగిన అభివృద్ధిని అధికారులతో సమీక్షించారు. వ్యవసాయ శాఖలో అమలు అవుతున్న పథకాలను మండల వ్యవసాయ అధికారి సమావేశంలో వివరించారు.అలాగే ఎంఇఓ సబర్మతి ప్రభుత్వ పథకాల అమలుకు విద్యార్థుల నమోదుకు ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని కోరారు. ఎస్ఆర్ పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్నారని ఇలా అయితే ఇతరులు ప్రభుత్వ పాఠశాలను నమ్మి ఎలా వచ్చి చేరుతారని ఎంపిటిసీ నాయకులు ప్రశ్నించారు. కొత్తపల్లిమిట్టలో మంచినీటి కోసం నిర్మించిన ట్యాంకును శుభ్రం చేయడం లేదని, ట్యాంకు మెట్లు విరిగిపోయాయని కో-అప్షన్ సభ్యుడు యేసురత్నం నిలదీశారు. దీనికి జడ్పీ నిధులతో నిచ్చెన ఏర్పాటు చేయాలని జడ్పీటిసీ రమణప్రసాద్ ఎంపిడిఓను కోరారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మోహన్‌మురళీ, తహసిల్దారు లోకనాథపిళ్ళై, ఇఓఆర్డీ కోదండరామిరెడ్డి, సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు దిలీప్‌రెడ్డి, సర్పంచ్‌లు డిల్లయ్య, చిట్టిమహేష్, ఎంపిటిసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వాడకం నిషేధం పై అవగాహన సదస్సు

పూతలపట్టు, జూన్ 2, ప్రభాతవార్త



పూతలపట్టు మండలం నందు పెట్టాగ్రహారం, తేనేపల్లి, పూతలపట్టు, గ్రామ పంచాయతీలలో షాప్‌ల దగ్గర, హోటల్స్ దగ్గర ప్లాస్టిక్ వాడటం వలన కలిగే నష్టం, అనారోగ్యాల గురించి స్వచ్ఛభారత్ మిషన్ రిజెక్ట్ కాన్సులెంట్ బాలసుందర్ ఈసీ శాంతి అవగాహన కల్గించడం జరిగింది. కమ్మగుట్ట పల్లి ఎస్‌డబ్ల్యూపిసిని విజిట్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల్ కోఆర్డినేటర్ రుక్మిణి, పంచాయతీ కార్యదర్శులు దేవిక, చరణ్ ప్రకాష్, ధరణి చంద్ర కుమార్ రైతులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న శింగనమల ఎమ్మెల్యే



**కాణిపాకం, జూన్ 2 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా శింగనమల ఎమ్మెల్యే బంగారు శ్రావణి సోమవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారివెంటఆలయ సూపరెండెంట్‌లు కోదండపాణి, టెంపుల్ ఇన్స్ పెక్టర్ రవి పాల్గొన్నారు.

## తవణంపల్లెలో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణపై కళాజాతా



***తవణంపల్లె, జూన్ 2 ప్రభాతవార్త:*** జిల్లా ఎయిడ్స్‌నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రం తవణంపల్లెలో సోమవారం హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణపై అవగాఘన కళాజాతా నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రియాంక ఆధ్వర్యంలో కళాకారులు ఈ కళాజాతా నిర్వహించారు. ఈసందర్భంగా ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు పాటల ద్వారా అవగాహన కల్పించారు. ఈకళాజాతా ఎంతో ఆకట్టుకుంది ఈకార్యక్రమంలో తవణంపల్లె పీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన శేఖర్, సీహెచ్ఓ రెడ్డెమ్మ, కోర్ ఎన్‌జీఓ ప్రోగ్రా ఆఫీసర్ సద్దాం, పీహెచ్‌సీ సిబ్బంది, కళాకారులు పాల్గొన్నారు.

## తెదేపానేతను పరామర్శించిన ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం

– సిఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటామని హామీ !!



***కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త*** మండలంలోని కంగుంది పంచాయతీ అంబాపురంకు చెందిన మాజీ విఎస్ఎస్ ఛైర్మన్ కన్నప్పను సోమవారం ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పరామర్శించారు. కన్నప్ప అనారోగ్యం పాలై స్థానిక శ్రీప్రియ నర్సింగ్‌హోంలో చికిత్స పొందుతున్నాడు. అతన్ని ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆస్పత్రి ఖర్చులన్నీ ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందేలా చర్యలు తీసుకుంటామని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, సర్పంచ్ ధనశేఖర్, నేతలు విసి మంజునాథ్, చంద్ర, షరీఫ్ పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 26 వినతులు

కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త

కుప్పం మండల కార్యాలయంలో కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై 26 వినతిపత్రాలను పి.డి.కి అందించారు. దీన్ని శాఖల వారీగా ఆయా శాఖల అధికారులకు అందజేసి త్వరగా వాటిని పరిష్కరించాలని ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆదేశించారు. అర్హులైన వారికి పెన్షన్లు మంజూరు చేయాలని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ వినతిపత్రం అందించారు. కార్యక్రమాల్లో తహాశీల్దార్ చిట్టిబాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## తెలుగుభాషలో బోర్డుల ఏర్పాటుకు వినతి

కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త

కుప్పంలోని ప్రభుత్వ కార్యాలయాల సముదాయ భవనం, కడ కార్యాలయాల వద్ద అధికార తెలుగుభాషలో బోర్డులను ఏర్పాటు చేయాలని కోరుతూ కడ పి.డి. వికాస్ మర్మత్‌కు సోమవారం చీలేపల్లి మాజీ సర్పంచ్ శివశంకర్ వినతిపత్రాన్ని అందజేశారు. సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కుప్పంలో అధికార భాష తెలుగును పటిష్టంగా అమలు చేసేలా తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. దీనిపై కడ పి.డి. సానుకూలంగా స్పందించి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

## సొంత భూమిలో ఇతరులు పూజలు చేసి త్రిశూలం నాటేశారు

– కడ పి.డి.కి భూయజమానుల ఫిర్యాదు !!



**కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త** తమ సొంతభూమిలో ఇతరులు అక్రమంగా ప్రవేశించి పూజలు చేసి త్రిశూలం నాటేశారని ఈ విషయంగా తమకు న్యాయం చేయాలని కోరుతూ కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్‌కు గుడుపల్లె మండలం కప్పలనత్తంకు చెందిన వెంకటరామప్ప అతని కుమారులు ఫిర్యాదు చేశారు. తమకు నలగాంపల్లి వద్ద సర్వే నెం 102/15లో 9సెంట్ల భూమి ఉందని అయితే ఈ భూమిలోకి తమ గ్రామానికే చెందిన నాగరాజు, జయప్ప, మురుగేష్, వెంకటేష్ తదితరులు అక్రమంగా ప్రవేశించి ఏవో పూజలు జరిపి త్రిశూలం నాటి ఉంటారన్నారు. ప్రశ్నిస్తే తమపై దాడులకు పాల్పడుతున్నారని ఈ విషయంగా విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు.

## అనారోగ్యంతో ఉన్న వ్యక్తికి ఆర్థికసాయం

కుప్పం, జూన్ 2 ప్రభాతవార్త



మండల ంలోని నాయనూరు ఎస్సీ కాలనీకి చెందిన సెల్వరాజు అనారోగ్యంతో బాధపడుతూ పిఇఎస్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అయితే అతని ఆరోగ్యం విషమించడంతో వైద్యులు తిరుపతి స్విమ్స్‌కు రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న కుప్పం తెదేపా విస్తరణ కమిటీ సభ్యులు కె. కన్నన్ ఆస్పత్రికి చేరుకుని బాధితుడ్ని పరామర్శించి ఆంబులెన్స్ ఖర్చుల నిమిత్తం ఐదువేల రూపాయల ఆర్థికసాయాన్ని సెల్వరాజ్ కుమారుడికి అందించారు.

## ప్రభుత్వ పాఠశాలలకు విద్యాసామగ్రి పంపిణీ

కుప్పంరూరల్, జూన్ 2 ప్రభాతవార్త



మండలంలోని జడ్పీ, యుపి, ప్రాథమిక పాఠశాలలకు సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్రలో భాగంగా విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు, బెల్టులు, డిక్షనరీలు పంపిణీ చేస్తున్నట్లు ఎంఇఓ 2 రాజారాం తెలిపారు. రాష్ట్ర విద్యాశాఖ మంత్రి ఇచ్చిన హామీలో భాగంగా 2025-26 విద్యా సంవత్సరంలో పాఠశాలల పున:ప్రారంభం నాటికే విద్యార్థులకు చేరాల్సిన, అందాల్సిన అన్ని రకాల విద్యాసామగ్రి అందించనున్నట్లు తెలిపారు.

## చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## పాడి పరిశ్రమ అభివృద్ధికే దాణా పంపిణీ : గువ్వల

చౌడేపల్లి, జూన్ 2 ప్రభాతవార్త



పాడి పరిశ్రమ అభివృద్ధికే ప్రభుత్వం దాణా పంపిణీ చేస్తోందని మండల తేదేపా అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి) అన్నారు. స్థానిక పశువైద్యం కేంద్రం వద్ద పాడిరైతులకు దాణాను పంపిణీ చేసారు. ప్రభుత్వం 50శాతం రాయితీతో రూ. 555లకే పశుదాణా అందిస్తోందనీ రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పశువైద్యాధికారి పవన్‌కుమార్, నాయకులు ఆవుల రామచంద్రయ్య, శ్రీధర్ రాజు(గిరి), పంజాణిపల్లి బాబు, విజయభాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యంరాజు, రమణ తదితరులు పాల్గొన్నారు.

## కేసులు కాదు హామీలను నెరవేర్చండి : వైకాపా

చౌడేపల్లి, జూన్ 2 ప్రభాతవార్త

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం పోలీసు కేసులపై కాకుండా ప్రజలకిచ్చిన హామీలపై దృష్టి సారించాలని మండల వైకాపా అధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి హితవు పలికారు. ఈనెల 4న పుంగనూరులో తలపెట్టిన వెన్నుపోటు దినంను పురస్కరించుకొని స్థానిక వైఎస్సార్ విగ్రహం వద్ద పోస్టర్లను ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి వైకాపా ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులపై కేసులు పెడుతున్నారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. జడ్పీటీసీ నడింపల్లి దామోధర్‌రాజు, ఎంపిపి గాజుల రామ్మూర్తి, చిత్తూరు, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాల వైకాపా అధ్యక్షుడు మిద్దింటి శంకరనారాయణ, వైస్ ఎంపిపి సుధాకర్‌రెడ్డి, మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపిపి రుక్మిణమ్మ, రాజా, షఫీ, షంషీర్, తొండా శ్రీరాములు, వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినోత్సవాన్ని విజయవంతం చేయండి



మండల వైసీపీ అధ్యక్షులు

వెదురుకుప్పం, జూన్ 2 ప్రభాతవార్త :

ప్రజలను మోసపూరిత హామీలతో మోసగించిన చంద్రబాబు పాలనకు వ్యతిరేకంగా నిర్వహించతలపెట్టిన వెన్నుపోటు దినోత్సవ కార్యక్రమంను విజయవంతం చేయాలని మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కామసాని పద్మనాభ రెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో సోమవారం వెన్నుపోటు దినోత్సవంపై గోడప్రతిక ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ఎండగట్టడంకు జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు జూన్ 4న నిర్వహించతలపెట్టిన వెన్నుపోటు దినోత్సవం విజయవంతం చేయాలన్నారు. మండలంలో వైసీపీ కార్యకర్తలు,నాయకులు, ప్రజాప్రతినిధులు, వైఎస్ఆర్ పార్టీ కుటుంబ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి సభ్యులు చలం పాళ్యం సుకుమార్, నియోజకవర్గం వైద్యవిభాగం అధ్యక్షులు డాక్టర్ కోలార్ ప్రకాష్, ఎంపిటిసి పుత్తూరు రాధికపురంధర్ రెడ్డి, నాయకులు పెద్ది రెడ్డి, రమేష్ రెడ్డి, వెంకటేష్, బొజ్జా రెడ్డి, గోవిందన్ తదితరులు పాల్గొన్నారు.

## దాసరి కాలనీ నిండ మురుగు నీరు

– పట్టించుకోని అధికారులు.



వెదురుకుప్పం, జూన్ 2 ప్రభాతవార్త :

దాసరి కాలనీ నిండ మురుగు నీరు సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని కాలనీ వాసులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి... మండలంలోని పచ్చికాపల్లం పంచాయితీ పరిధిలోగల దాసరి కాలనీలో వీధులు గుంతలమయం కావడం మురుగునీరు నిండి నడక నరకప్రాయంగా మారిందని ఆవేదన చెందారు. మురుగు నీరు చేరడంతో దోమల బెడద ఎక్కువైయిందని ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని చెప్పారు. రాత్రిపూట దోమల బెడదతో నిద్రరావడం లేదన్నారు. మురుగు కాలువలు నిర్వహణ లేకపోవడంతో పూడిపోయి నీరు రోడ్ల పైకి చేరిందన్నారు. అపరిశుభ్రంగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. కరోనా వ్యాప్తిచెందుతున్న భయందోళన పరిస్థితులలో పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం,చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవడం ఇబ్బందులు కల్గిస్తుందన్నారు. అధికారులు స్పందించి మురుగునీటి గుంతలు, కాలవులను శుభ్రం చేయించి కాలనీ వాసులను ఆదుకోవాలని కోరుతున్నారు.

## మదనపల్లె జిల్లా కేంద్రం కావాలి

పుంగనూరు, జూన్ 2, ప్రభాతవార్త



మదనపల్లి జిల్లా కేంద్రం చేయాలని కోరుతూ గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం ఉదయం మదనపల్లె సబ్ కలెక్టర్‌ను కలిసి గిరిజన సంఘాలు వినతిపత్రం సమర్పించాయి. మదనపల్లిలో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్మెంట్ ఏజెన్సీ ఏర్పాటు చేయాలని, కేంద్ర ప్రభుత్వం మదనపల్లి కేంద్రంగా ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు చేయాలని, గిరిజన కళాకారులకు గుర్తింపు కార్డు, పింఛన్ ఇవ్వవలనీ, మదనపల్లి కేంద్రంగా గిరిజన ఐటిఐ కాలేజ్ ఏర్పాటు మరియు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ ద్వారా గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్లో కేటాయించిన ట్రైబల్ సబ్ ప్లాన్‌ను గిరిజనుల అభివృద్ధికి ఉపయోగించాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో ఎస్సీ ఎస్టీ బ్యాక్ లాక్ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం గిరిజన సంఘాల జేఏసీ మదనపల్లి కన్వీనర్ డాక్టర్ బాణావత్, మునీంద్ర నాయక్ ఆధ్వర్యంలో జరిగింది. గిరిజన సంఘ నాయకులుహరి శివప్ప, బొజ్జప్ప, మున్నా నాయక్, మోహన్ నాయక్, అమరేంద్రనాయక్, శంకర్ నాయక్,పాల్గొన్నారు.

## పసుపులేటిని కలిసిన జనసేన నాయకులు

పుంగనూరు రూరల్, జూన్ 2, ప్రభాతవార్త



రాష్ట్ర హస్తకళల కార్పొరేషన్ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన పసుపులేటి హరిప్రసాద్‌ను పుంగనూరు జనసేన నాయకులు విజయవాడలో మర్యాద పూర్వకంగా కలిశారు. సోమవారం నియోజకవర్గ ఇన్చార్జ్ చిన్న రాయల్, నియోజకవర్గ నాయకులు కోలా సోమశేఖర్, రొంపిచర్ల నాయకులు రెడ్డి, శివరాయల్, పులిచెర్ల నాయకులు మునికృష్ణలతో పాటు కలిసే అభినందనలు తెలిపారు. రాష్ట్ర హస్తకళల డెవలప్మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పదవిపసుపులేటి హరిప్రసాద్‌కు ఇవ్వడం చాలా సంతోషంగా భావిస్తున్నారు.

## శ్రీ ధనుకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ

పుంగనూరు రూరల్, జూన్ 2, ప్రభాతవార్త



మండలంలోని గూడూరుపల్లిలో ధనుకొండ గంగమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వేద పండితుల ఆధ్వర్యంలో గంగపూజ, కలశస్థాపన, పుణ్యావాచనం, గణపతిపూజ, నాంది, అంకురార్పణ, గణపతివాస్తు, రక్షోఘ్నహోమం, జలాధివాసం, క్షీరాధివాసం, ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయాధివాసం లాంటి శాస్త్రోక్త క్రతువులు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తుల దర్శనార్థం ఉంచారు. గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం గ్రామంలో ఆధ్యాత్మికతకు, సంప్రదాయాలకు నిదర్శనంగా నిలిచింది.

## బదిలీలో నష్టపోయిన ప్రభుత్వ టీచర్లకు న్యాయం

– అర్జెడీ శ్యామూల్‌ను కలిసి విన్నవించిన యుటిఎఫ్ నాయకులు

చిత్తూరు, జూన్ 2 ప్రభాతవార్త:



పిఎస్ హెడ్మాస్టర్ల బదిలీల్లో నలుగురు ఉపాధ్యాయులకు అన్యాయం జరిగిందని వీరికి న్యాయం చేయాలని అర్జెడీ శ్యామూల్‌ను కలిసి సోమవారం యుటిఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. అర్జెడీ శ్యామూల్ సోమవారం చిత్తూరు వచ్చిన సందర్భంలో యుటిఎఫ్ నాయకులు ఆయనను కలిసి మాట్లాడుతూ టిటిడి ఉద్యోగుల్లో స్పౌజ్ పాయింట్లు వున్న వారికి వర్తింపజేయాలని, అలాగే తొట్టంబేడు మండలం రామచంద్రాపురం ప్రభుత్వ పాఠశాల మేనేజ్‌మెంట్ మార్పును సవరించాలని, నిబంధనలకు విరుద్ధంగా పాయింట్లు పొందిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే సాంకేతిక సమస్యలపై పాయింట్లు కోల్పోయిన వారికి ఆ పాయింట్లను యాడ్ చేయాలని కోరారు. అర్జెడీ శ్యామూల్‌ను కలిసి వినతిపత్రం అందించిన వారిలో రాష్ట్ర యుటిఎఫ్ కార్యదర్శి ఎస్ఎస్ నాయుడు, జివి రమణ, జిల్లా యుటిఎఫ్ నాయకులు వున్నారు.

## ఘనంగా శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ కుంబాభిషేకం



***రామకుప్పం, జూన్ 2 ప్రభాతవార్త*** మండలంలోని సగినేకుప్పంలో నూతనంగా నిర్మించిన శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయ కుంబాభిషేకాన్ని ఘనంగా నిర్వహించారు. గణపతిపూజ, కుంకుమార్చన, హోమాలు నిర్వహిం చారు. అమ్మవారికి విశేషంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులుభక్తులకు అన్నదానం జరిపారు. స్థానిక తెదేపా నేతలు పాల్గొన్నారు.

## పుత్తూరు ఎక్సైజ్ అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు

***తిరుపతి కలెక్టరేట్, జూన్ 2 ప్రభాతవార్త :*** రాష్ట్ర ప్రభుత్వం గౌడ్‌లకు కేటాయించిన మద్యం షాపులపై పుత్తూరు ఎక్సైజ్ అధికారులు జులుం విధిలిస్తున్నారని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కల్లూరు నాగరాజు గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిలో భాగంగా సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి పుత్తూరు ఎక్సైజ్ అధికారులపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం కేటాయించిన కేంద్రంలో మద్యం దుకాణాన్ని నడుపుకుంటున్నారని, అయితే పుత్తూరు ఎక్సైజ్ అధికారులు స్థానిక రాజకీయ నాయకుల ఒత్తిళ్ళు, మరో మద్యం దుకాణ దారుల యాజమాన్యానికి కొమ్ముకాస్తూ గౌడ్‌ల మద్యం షాపును వేరే ప్రాంతాలకు మార్చుకోవాలని లేకుంటే ఇబ్బందులు పడుతారని ప్రత్యక్షంగా, పరోక్షంగా పుత్తూరు ఎక్సైజ్ అధికారులు గౌడ్ మద్యం షాపు యాజమాన్యాన్ని బెదిరించడం ఏమిటని ప్రశ్నించారు. దీనిపై కలెక్టర్ వెంటనే స్పందించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పుత్తూరు గౌడ్ కుటుంబాలు, బాధితులు పాల్గొన్నారు.

## ఆర్టీసీ తిరుపతి డిపోలో సీనియర్లు అన్యాయం

– న్యాయం చేయాలని కలెక్టర్‌కు ఆర్టీసీ యూనియన్ నేతలు ఫిర్యాదు

**తిరుపతి కలెక్టరేట్, జూన్ 2 ప్రభాతవార్త :** ఆర్టీసీ తిరుపతి డిపోలో సీనియర్లకు అన్యాయం జరుగుతోందని ఏపీ పబ్లిక్ ట్రాన్స్‌ఫోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఆర్టీసీ) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ నేతు మల్లికార్జున, శివకుమార్, రమణ బాధపడ్డారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి బస్టాండ్‌లో విచారణ/అనౌన్స్‌మెంట్ డ్యూటీలను తిరుపతి డిపో సిబ్బందిలో సీనియర్ ఉద్యోగులు నిర్వహిస్తున్నారు. మే నెల 16వ తేది నుంచి కాంట్రాక్ట్‌కు ఇచ్చినందున ఆ సెక్షన్‌లో పనిచేస్తున్న 10 మంది సీనియర్ ఉద్యోగులు డ్యూటీ చార్ట్స్ లేకుండా స్పేర్‌లోకి తీసుకుని వచ్చారన్నారు. అయితే సీనియర్లు కాదని తిరుపతి డిపో మేనేజర్ స్వంత నిర్ణయాలతో ఆర్టీసీ నిబంధనలకు వ్యతిరేకంగా సీనియర్ ఉద్యోగులను వేధిస్తున్నారని బాధపడ్డారు. దీనిపై సమగ్ర దర్యాప్తు జరిపి , సీనియర్లుకు న్యాయం చేయాలని వారు కలెక్టర్‌ను కోరారు.

## వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ పంఫిణి చేసిన ఎమ్మెల్యే నాని

– రేషన్‌లో అక్రమాలకు చెక్ ....పారదర్శకంగా రేషన్ పంఫిణి

తిరుపతిరూరల్, జూన్ 2 ప్రభాతవార్త:



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యుండియు వ్యవస్తను రద్దు చేసి, లబ్దిదారులకు పారదర్శకంగా రేషన్ దుకాణాలు ద్వారానే రేషన్ పంఫిణి చేస్తున్నట్లు ఎమ్మెల్యే పులివర్తి నాని తెలిపారు. సోమవారం మల్లంగుంట గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్టీ క్రిష్ణారెడ్డి కాలనీలో వృద్దులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ పంఫిణి చేసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రేషన్ పంఫిణిలో అక్రమాలు జరిగాయని, నిత్యవసర సరుకుల కోసం వేచి ఉండే పరిస్థితి లేకుండా చౌకదుకాణాల ద్వారానే రేషన్ పంఫిణి చేస్తున్నట్లు తెలిపారు. వైసిపి తప్పిదాలను సరిచేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. ఒకటో తారీఖు నుండి 15వ తారీఖు వరకు ఉదయం 8గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుండి రాత్రి 8గంటల వరకు రేషన్ పంఫిణి జరుగుతుందని తెలిపారు. 65సంవత్సరాలు నిండిన వయోవృద్దులకు, దివ్యాంగులకు ఇంటివద్దకే రేషన్ సరఫరా చేయబడునని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, అలిమినేని మధు, మల్లంగుంట టిడిపి నాయకులు పార్లపల్లి మునికృష్ణారెడ్డి, అవిలాల దిలీప్ యాదవ్, మెందు చలపతి, వెంకటేష్ యాదవ్,పొట్టేలి రామకృష్ణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఆర్థిక సహాయం:



**తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త** తొట్టంబేడు మండలంలో సుమారు 20సంవత్సరాలుగా నిర్వివాదాంశుడుగా పని చేసిన జర్నలిస్టు చిట్టత్తూరు మెహర్ కుమార్ గతనెల 30న ఆకస్మికంగా మృతి చెందారు. అందరితో కలగలుపుగా పని చేసే మెహర్ కుమార్ ఆకస్మిక మృతితో శ్రీకాళహస్తి ఓ మంచి విలేకరిని పొగొట్టు కున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ అంకాళమ్మ హెల్పింగ్ హ్యాండ్స్ కు చెందిన యశ్వంతరావు ఆయన తల్లికి రూ.6వేలు ఆర్థిక సహాయం అందించారు. ఆమెను ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.ఆయనతోపాటు హరిహరకు మార్, క్రాంతికుమార్, నాగులపల్లి శివకుమార్‌రెడ్డి, రాఘవేంద్ర,సత్యనారాయణ,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు ఉంటే ఎక్కడైనా రేషన్ తీసుకోవచ్చు! నాగమల్లి



**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త** ఉమ్మడి ప్రభుత్వం ప్రజాసంక్షేమమే ప్రధానలక్ష్యంగా పని చేస్తుందని ఏడాది పాలనలో ఎన్నో సంస్కరణలు అభివృద్ధి పనులను చేపట్టిందని ప్రస్తుతం రేషన్ కోసం వీధి వీధి తిరిగే బాధలను తప్పించి తాము ఎక్కడుంటే అక్కడ రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించిందని తెలుగుదేశం మీడియా ప్రతినిధి, 23వ వార్డు మాజీ కౌన్సిలర్ నాగమల్లి దుర్గా ప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన 23వ వార్డు పరిధిలోని చౌకదుకాణంకు సంబందించిన సరకులను అందించారు. గత ప్రభుత్వం ప్రత్యేకంగా వాహనాలను ఏర్పాటుచేసి లబ్దిదారులను వీధుల్లో బారులుగా గంటల కొద్ది నిలబెడితే తమ ప్రభుత్వం ఎక్కడ అందుబాటులో ఉంటే రేషన్ తతీసుకునే వెసులుబాటు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాల్లో నాయకులు ఎన్.వినయ్‌కుమార్, రేషన్ డీలర్ వార్డు ప్రజలు పాల్గొన్నారు.

## 18వ వార్డు సచివాలయంలో 'యోగంధ్రా'

**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పురపాలకసంఘ పరిధిలోని 18వ వార్డులో సోమవారం సచివాలయంలో 'యోగాంధ్ర' కార్యక్రమాలను నిర్వహించారు. సచివాలయ కార్యదర్శి ఝూన్సి పర్యవేక్షణలో ఆ వార్డుకు చెందిన తెలుగుదేశం బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్‌యం.ఉమేష్‌రావులు పాల్గొన్నారు. తీవ్రమైన వత్తిడిని ఎదుర్కొంటున్న వారికి మానసిక,శారీరక సాంత్వన చేకూర్చేయోగా సాధనకు ముఖ్యమంత్రి ప్రకటించటం ఆయన దీర్ఘదృష్టికి నిదర్శనం అన్నారు. ఈ నెల 21న అంతర్జాతీయయోగా దినోత్సవం సందర్భంగా ప్రధాని తోపాటు రెండుకోట్ల మంది యోగాసానాలు వేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించటం రాష్ట్ర ప్రజల ఆరోగ్యం పట్ల గల గుర్తింపుకు నిదర్శనం అన్నారు. నెల రోజుల పాటు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలంటే ప్రత్యేకయాప్‌లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఉమేష్‌రావు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురువారెడ్డి, మాజి మున్సిపల్ వైస్ చైర్మెన్ మిన్నల్ రవి,పేట బాలాజిరెడ్డి, దొరైరాజ్‌రెడ్డి, మునిరాజాయాదవ్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సూపర్ సిక్స్ పథకాల అమలు ఎప్పుడు?

### తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా

**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త**



కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు మెనఫేస్టోలో పొందుపరచిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఐ సారధ్యంలో ధర్నా నిర్వహించారు.సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా ఆందోళనలు చేపట్టినట్లు వివరించారు. ఉమ్మడి ప్రభుత్వం పేద ప్రజలకు పట్టణ ప్రాంతంలో ఇంటి జాగాలు రెండు సెంట్లు, గ్రామాల్లో 3సెంట్లు ఇవ్వటానికి నిర్ణయించిందన్నారు. ఇల్లు నిర్మించుకోవటానికి రూ.5లక్షలు ఆర్థిక రుణ సదుపాయం కల్పిస్తామంటూ భరోసా ఇచ్చిన విషయం మరచినట్లుందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి పట్టించుకోవటం లేదన్నారు. ఒక్క పెన్షన్లు ఇచ్చినంత మాత్రానా ప్రజలకు ఒనగూడేది ఏమి లేదన్నారు.ఇంటి స్థలాల కోసం ఇళ్ళ కోసం నిరుపేద ప్రజలు ఆర్‌డిఓ,తహశీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకునే దిక్కులేదన్నారు.ఈ ఆందోళనల్లో సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, జనమాల గురవయ్య, గోపి,శివకుమార్, మల్లికార్జున, మునిచెందు తదితరులు పాల్గొన్నారు.

## వాహన చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి!

**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త**



వాహన చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కల్గి ఉండాలని టూటౌన్ సిఐ నాగార్జున్‌రెడ్డి పిలుపు నిచ్చారు.ఈ మేరకు ఆయన సోమవారం పోలీసుస్టేషన్ పరిధిలో సిబ్బంది ఇతరులకు శిక్షణ ఇచ్చారు. ముఖ్యంగా శ్రీకాళహస్తిలో వాహన చోదకులు ట్రాఫిక్‌పై అవగాహన లేకుండా వాహనాలను నడుపుతున్నారన్నారు. ప్రత్యేకించి ఆటోలు నడుపుతున్న వారికి ఏ మాత్రం ఆవగాహన లేక అడ్డదిడ్డంగా నడుపుతూ ప్రమాదాలకు గురి చేస్తున్నారని సిఐ ఆవేదన వ్యక్తం చేసారు. అయితే వాహన దారులు ప్రతి ఒక్కరు డ్రైవింగ్ లైసెన్సు పొంది ఉండాలన్నారు. ఇది జీవితానికి ఎంతో ప్రయోజనకరం అన్నారు. ఇన్సూరెన్స్ కల్గి ఉండాలన్నారు. హెల్మెట్,సీట్ బెల్టు ధరించాలన్నారు. నిబంధనలను అమలు చేయకుంటే ఎంతటి వారైనా చట్టపరిధిలో ఉపేక్షించేది లేదన్నారు. ఎవరైనా మద్యం తాగి వాహనం నడిపితే వారిని అదుపులో తీసుకొని జరిమాన విధించటమే కాకుండా కేసులు నమోదు చేసి వాహనాలనుసీజ్ చేస్తామన్నారు. గతంలో జరిమాన విధించబడి చెల్లించని వారు వెంటనే ఆన్‌లైన్లో చెల్లించాలని లేకుంటే అరెస్టు చేసి వసూలు చేస్తామన్నారు. సోమవారం మద్యం సేవించి వాహనంనడిపినముగ్గురిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు సిఐ నాగార్జున్ రెడ్డి వివరించారు.

## మండల ఉపాధ్యక్షుల నియామకం

**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని వైకాపా పార్టీని బలోపేతం చేయటానికి తమతో పాటు నడుస్తున్న వారికి పార్టీ పదవులను శాసనసభ్యుడు అందించి కాపాడుకుంటున్నారు.ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాలకు ఉపాధ్యక్షులను నియమించారు. పార్టీ అధ్యక్షులను నియమించిన తరువాత ఉపాధ్యక్షుల పదవులను వివిధ సమీకరణలతో అప్పగించారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తి మండల ఉపాధ్యక్షుడుగా చెర్లోపల్లి గ్రామానికి చెందిన మావిళ్ళ పల్లి వెంకటేశ్వరనాయుడును నియమించినట్లు సమాచారం.కాగా ఏర్పేడుమండల ఉపాధ్యక్షుడుగా బండారుపల్లి మునికృష్ణారెడ్డిని నియమించారు.ఈ మేరకు పార్టీ నియామక పత్రాలను మాజీ శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి, ఎంఎల్‌సి డాక్టర్‌సిపాయి సుబ్రమణ్యంలు అందించారు. వారిని అభినందించారు. త్వరలో తమ పార్టీ అధికారంలోకి రానున్నదని పార్టీ మీ సేవలను సదా గుర్తిస్తుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమాల్లో మంల పార్టీ అధ్యక్షుడు చెవిరెడ్డి మధుసూధనంరెడ్డి వయ్యాల కృష్ణారెడ్డి,మనోహర్‌రెడ్డి,అంకయ్య,పసల కృష్ణయ్య,నాగరాజు,నారాయణ,యాకూబ్,మునిరత్నం రెడ్డి,వినోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాజెక్టు వీధి మురుగునీటి కాలువలకు మోక్షం కల్పించరా?

**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి మున్సిపాలిటి పరిధి లోని ప్రాజెక్టు వీధిలో మురు గునీటి కాలువలకు మోక్షం కల్పించాలని ఆ వాడ ప్రజలు పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయ కుమార్‌ను కోరారు.సోమవారం ఇక్కడ ఓ కార్యక్రమానికి హాజరైన ఆయనను ఈ ప్రాంత ప్రజలు చుట్టుముట్టారు. ఇక్కడ చాలా కాలంగా మురుగునీటి కాలువలు దుస్థితిలో ఉన్నాయి. అస్తవ్యస్తంగా ఉన్న మురుగునీటి కాలువలకు సంబంధించి విజయకుమార్‌ను ప్రజలు క్షేత్ర స్థాయిలో చూపించారు. ఇక్కడ అర్థాంతరగా ఆగిన కాలువ పేరుకుపోయిన చెత్తా చెదారంతో ఈగుల దోమలు ముసురుతుండగా చూసారు. వెంటనే ఆయన మున్సిపల్ అధికారులతో చర్చించారు. ఇక్కడ ఒకే మార్గంలో కాలువ వెళ్ళేటట్లు ప్రణాళిక రూపొందించి నిర్మించాలని సూచించారు. విజయకుమార్‌తోపాటు కంఠా రమేష్,రమణ పాల్గొన్నారు.

## పుణ్యక్షేత్రంలో శాంతి భద్రతలకు సహకరించండి!

### లాడ్జిలు డాబాల వారికి సూచనలు

**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి పట్టణంలో బార్ అండ్ రెస్టారెంట్లు డాబాలకు సంబందించిన యాజమానులతో సోమవారం డివైఎస్పీ నరసింహామూర్తి సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ యాజమానులు పాటించాల్సిన నిబంధనల గురించి వివరించారు.నిబంధనలు వ్యతిరేకిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.డాబాలు బార్ అండ్ రెస్టారెంట్లు ప్రభుత్వం పాటించిన సమయం ప్రకారమే అనుమతిం చాలని వారు అన్నారు.ఎవరైన నిబంధనలు అతిక్రమిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.ఈ కార్యక్రమంలో డాబా,బార్,రెస్టారెంట్ యాజమానులు పాల్గొన్నారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో అశ్వమేధ ప్రతిభ



**తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాతవార్త** జేఈఈ అడ్వాన్స్ ఫలితాలలో అశ్వమేధ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలతో ప్రతిభ చాటాలని ఆ కళాశాలల డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, టీఎం.గోవర్ధనలు తెలిపారు.స్థానిక ఎంఆర్ పల్లి సర్కిల్లోని ఆ కళాశాల ప్రాంగణంలో సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ తమ సంస్థ నుంచి పది హేను మంది విద్యార్థులకు 9 మందికి ఐఐటి ర్యాంకులు వచ్చినట్లు వెల్లడించారు.వివిధ కేటగిరీల్లో నిఖిల్ 287, వెంకట సాయి 4699, సిద్దార్థ 2095, కె. యశశ్రీ 2755, డి.శ్రీ వైష్ణవి 3872, సివి రేవంత్ 4530, జి.వెంకటరెడ్డి 4627, ఎస్ సుభద్ర సాహితి 4011, శ్రీహరి 180 ర్యాంకులు సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు సుమతి,రామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## వేదిక్‌లో పలు కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానం

**తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాతవార్త**

టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వీ వేదిక్ వర్సిటీలో 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి పలు కోర్సులకు దరఖాస్తులకు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10వ తేదీలోపు ఆసక్తిగల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో బీఏ (శాస్త్రీ), ఎంఏ (ఆచార్య), పీహెచ్ఏ, సర్టిఫికేట్, డిప్లొమో కోర్సులు అందుబాటులో ఉన్నట్లు తెలియజేశారు. ఆసక్తిగల అభ్యర్థులు అర్హత,దరఖాస్తు వివరాలకు వర్సిటీ అధికారిక వెబ్సైట్ ను సంప్రదించాలని సూచించారు.

## జేఈఈ అడ్వాన్స్‌లో శ్రీ చైతన్య విజయకేతనం

**తిరుపతి విద్య జూన్ 2 ప్రభాత వార్త**



జేఈఈ అడ్వాన్స్ డ్ ఫలితాలలో శ్రీ చైతన్య విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులతో విజయకేతనం ఎగరవేశారని ఆ విద్యాసంస్థల కార్యనిర్వాహకులు ఏజీఎం బివి.ప్రసాద్ తెలిపారు.స్థానిక గాంధీ రోడ్ లోని ఆ కళాశాల ప్రాంగణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జేఈఈ అడ్వాన్స్డ్ ఫలితాలలో వివిధ విభాగాల నుండి పి. సాయి ముఖేష్ 115 ర్యాంకు, మునికృష్ణ 228, అశోక నాయక్ 542, ఏం భరత్ 847, సి. సహస్ర 1202, బిఆర్ కులయప్ప నాయక్ 1335, మోక్షిత్ శర్మ 1371, జ్ఞాన సాత్విక్ 1625, అమూల్య 1830, కే అభిరాం సాయి 2017, గంగ మనోజ్ కుమార్ 2333, ఏ.మణి 2453, జ్ఞాన దీక్షిత 3453, ఎన్. భాను ప్రకాష్ 3992, కే జీవన్ కుమార్ 4099, కే కార్తికేయ 4696, ఎం కావ్య 4698, వరుణ్ తేజ్ 5161, ఎస్ హేమంత్ చౌదరి 5189, మనీష్ 5263 వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు అన్ని కేటగిరీలో సుమారు 42 మంది విద్యార్థులు ప్రతిష్టాత్మక ఐఐటీలో సీట్లు పొందే ర్యాంకులు సాధించారని వెల్లడించారు.ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయనతో పాటు డైరెక్టర్లు సుష్మ శ్రీ, నాగేంద్ర అభినందించారు.ఈ కార్యక్రమంలో డిన్లు కేఎల్ జి ప్రసాద్,రామ్మోహన్ రావు, శ్రీనివాసరాజులతో పాటు ప్రిన్సిపాల్ లు అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**విజయపురం, జూన్ 2 ప్రభాతవార్త:** రాష్ట్ర వైసీపీ పిలుపు మేరకు మాజీ మంత్రి రోజా సెల్వమణి ఆధ్వర్యంలో ఈ నెల 4 నియోజకవర్గ కేంద్రం నగరిలో చేపట్టనున్న వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజయపురం మండల పార్టీ అధ్యక్షుడు జి.శివరాజు పిలుపునిచ్చారు. అందులో భాగంగా సోమవారం మండల కేంద్రమైన విజయపురంలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర రైతు విభాగ కార్యదర్శి గుణశేఖర్‌రెడ్డి, వైసీపీ రాష్ట్ర పంచాయతీ రాజ్ కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు, ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు, ఎంపీపీ జమున, మండల ఉపాధ్యక్షుడు సతీష్ యాదవ్, నాయకులు నారపరాజు, సుబ్బుయాదవ్, ప్రసన్న కుమార్, మురళీకృష్ణారెడ్డి, రమేష్‌రెడ్డి, దిలీప్‌కుమార్, కృష్ణయ్య శెట్టి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## డిఇఇకి కమిషనర్ బాధ్యతలు . . .

**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త**

శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ బాధ్యతలను డిఇఇ సంజీవ్‌కుమార్‌కు అప్పగించారు. ఇక్కడ కమిషనర్‌గా పని చేసిన బి.యస్.గిరికుమార్ మే 31న ఉద్యోగ విరమణ చేసారు. ఆయనకు సాదరంగా వీడ్కోలు పలికారు.కొత్త కమిషనర్ నియామకం జరిగే వరకు ఇన్‌చార్జి బాధ్యతలను డిఇఇకి అప్పగించారు. అభివృద్ధి పనులు,పారిశుద్ధ్యంను ఆయన పర్యవేక్షిస్తారు.

## ఉద్దేశపూర్వకంగా టిటిడిని భ్రష్టుపట్టించుటకు వైకాపా . . .

**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త**



పవిత్రమైన తిరుమలేశుని పేరు ప్రతిష్టలను భ్రష్టుపట్టించుటకు పథకం ప్రకారం వైకాపా పని చేస్తుందని ఉమ్మడి చిత్తూరుజిల్లా జనసేన కార్యదర్శి అంజూరు చక్రధర్ ధ్వజమెత్తారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో వరుస ఘటనలు ప్రమాధవశాత్తో,ఆకస్మికంగానో జరిగినవి కావని,ముందస్తు ప్రణాళికలతో నేరపూరిత కుట్రలని ఆయన ఆరోపించారు.దీనిపై ధర్మకర్తల మండలి సమగ్ర విచారణ జరపాలని ఆయన కోరారు. అధికారాన్ని కోల్పోయిన వైకాపా ఉద్దేశపూర్వకంగా తితిది ప్రతిష్టను కూటమి ప్రభుత్వంపై బురద చల్లటానికి తప్పుడు వార్తలు సృష్టించి తన పత్రికలో వండి వారుస్తుందని ధ్వజమెత్తారు. ఈ నేపథ్యంలో టిటిడి నిర్వహిస్తున్న గోశాలలో వందసంఖ్యలో ఆవులు చనిపోయాయని వీడియోలు ప్రదర్శిస్తూ ప్రజల్ని తప్పు దారి పట్టించుటకు ప్రయత్నించటం గమనిస్తే వారి తీరు అర్థమౌతుందన్నారు. తిరుమలలో అన్యమత కార్యకలాపాలపై నిషేధం ఉన్నప్పటికి ఒక వ్యక్తి ప్రార్థన చేస్తుండగా రికార్డు చేసారన్నారు. దాన్ని సామాజిక మాద్యమాల్లో ప్రసారంచేసి ఆలయ పవిత్రతపై దెబ్బతీసారన్నారు. బోర్డు చైర్మెన్‌కు వ్యతిరేకంగానినాదాలు చేస్తున్నట్లు వీడియోలను చిత్రీకరించటం వారి తీరును బహిర్గతం చేస్తుందన్నారు.ఇలాంటి కుట్రకోణాలకు సంబంధించి సమగ్ర విచారణ జరిపి బుద్ది చెప్పాలని చక్రధర్ కోరారు.

## గుర్తుతెలియని వ్యక్తి మృతి



**శ్రీకాళహస్తిరూరల్, జూన్ 2 ప్రభాతవార్త** శ్రీకాళహస్తికి సమీపంలోని ఏర్పేడు-వెంకటగిరి మార్గంలోని అమందూరు చెరువుకట్ట పక్కన ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని కనిపెట్టినట్లు ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి సోమవారం వివరించారు.వివరాలు రైల్వే ఎఎస్ఐ ధర్మసింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు వివరించారు. అమందూరుచెరువుకట్ట సమీపాన బ్రిడ్డి వద్ద సుమారు 40-45 సంవత్సరాల వయస్సు గల వ్యక్తి శవాన్ని కనుగొన్నారు. ఆతను గళ్ళ షర్టు, లుంగీ బ్లూ డ్రాయర్ ధరించి ఉన్నాడని చుట్టుపక్కల గ్రామస్థులను విచారించగా ఎవ్వరూ ఆతన్ని గుర్తించలేదన్నారు. దాంతో శవాన్ని రైల్వే పోలీసులు పోస్టుమార్టంలో శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించారని తాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

## శివయ్య సేవలో జనసేన రాష్ట్ర కార్యదర్శి

**శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో సోమవారం జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొలిశెట్టి సత్యనారాయణ కుటుంబ సభ్యులతో పాల్గొన్నారు. వారికి ఆలయమర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్‌మేరకు ఎఇఓ సతీష్‌మాలిక్, పిఆర్‌ఓ రవి లు స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి మృత్యుంజయ స్వామి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు. స్వాగతం పలికిన జనసేన నాయకుల్లో పట్టణ ప్రధాన కార్యదర్శి కవిత, పార్టీ నాయకులు కుమార్,మహేష్, చిరంజీవి,సురేష్, లీలాధర్,దండి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## రజకసంఘ నాయకుడు మృతి

**తొట్టంబేడు, జూన్ 2 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తికి చెందిన రజకసంఘ నాయకుడు గురవయ్య ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని శ్రీకాళహస్తి శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ అన్నారు. సోమవారం తొట్టంబేడు మండలంలోని ఇలగనూరు గ్రామానికి వెళ్ళి ఆమె నివాళులర్పిం చారు. ఆరునెలల క్రితం గురవయ్య సతీమణి మృతి చెందింది. దాంతో గురవయ్య మంచం పట్టాడని వివరించారు. సోమవారం ఆయన మృతి చెందారు. కాగా సమీపంలోని గుర్రప్పనాయుడు కండ్రిగ దళిత వాడకు చెందిన రవిచంద్రకుమార్తె జ్యోతి ఒరెండు రోజుల క్రితం మూర్చ వ్యాదితో మృతి చెందింది. వారి ఇంటికి వెళ్ళి పరామర్శించారు. ఆమెతోపాటు మండల తెలుగుదేశం నాయకుడు రావిళ్ళ మునిరాజానాయుడు, మాజీ శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, కామేష్‌యాదవ్, సుశేఖర్‌నాయుడు, పెళ్ళూరు రాజగోపాల్, రామయ్య,పెంచలయ్య, వెంకటయ్య, మురళి,భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## నజీర్ కుటుంబానికి సర్పంచ్ కోటేశ్వరరావు ఆర్థిక సాయం



**తిరుపతిరూరల్, జూన్02 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ లింగేశ్వర్‌నగర్‌లో నజీర్ అనే నిరుపేద మృతి చెందడంతో ఆ కుటుంబానికి సర్పంచ్ ముసుకు కోటేశ్వరరావు రూ.5000 రుపాయాలు ఆర్థిక సాయం అందించి, దాతృత్వాన్ని చాటుకున్నారు. కోటేశ్వరరావు సర్పంచ్ పదవి చేపట్టినప్పటి నుండి పంచాయతీలో ఆర్థికంగా వెనకబడినవాళ్ళు మృతిచెందితే, ఆర్థిక సాయం అందిస్తూ మానవత్వాన్ని చాటుతూ పదిమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు. పండగలు, జాతర్లకు, వివిధ రకాల వినోద కార్యక్రమాలకు కూడా ఆర్థిక సాయం అందించడం అనవాయితీగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు, వైకాపా గ్రామ కమిటీ అధ్యక్షులు రవి తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అధికార సంఘం పేరుతో మోసపూరిత వ్యాఖ్యలు తగవు

### -విఆర్వో సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పుల్లూరు రాఘవరెడ్డి

**తిరుపతిరూరల్, జూన్ 2 ప్రభాతవార్త:**



రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం పేరుతో అనాలోచిత, అసంబద్ధ, మోసపూరిత వాఖ్యలు చేస్తే చూస్తూ ఊరుకోమని భూపతిరాజు రవీంద్రరాజుపై రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పుల్లూరు రాఘవరెడ్డి ఒక ప్రకటనలో మండిపడ్డారు. రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు అన్ని జిల్లాల నుండి ఏ.పి. రెవెన్యూ అసోసియేషన్స్ అధ్యక్షకార్యదర్శులు హెచ్చరికలు జారీ చేసారు. ఎపిజెఏసి చైర్మెన్, ఏపిఆర్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు విశాఖ జిల్లా వేదికగా జరిగిన మీడియా సమావేశంలో ఉద్యోగుల సమస్యలపై సున్నితంగా ప్రస్తావించారని తెలిపారు. ఉద్యోగుల సమస్యలు చర్చించటానికి, పరిష్కారానికి ముఖ్యమంత్రి కార్యాలయం నుండి స్పష్టమైన పిలుపు రాలేదని తెలిపారన్నారు. కొందరు స్వార్థపూరిత ఆలోచనలతో రెవెన్యూ సంఘాన్ని చిన్నభిన్నం చేయటానికి ప్రయత్నిస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు. రెవెన్యూ సమస్యలు పరిష్కారం బొప్పరాజుతోనే సాధ్యమన్నారు. భూపతిరాజు అడ్డగోలు మాటలను ఎవ్వరు నమ్మరన్నారు. ఇలాంటి చౌకబారు వాక్యలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

## తనను గోకితే భూ కబ్జాలన్ని బయట పెడతా

**తిరుపతి హెల్త్, జూన్ 2 ప్రభాతవార్త :** తనను గోకితే గత వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ కబ్జాలన్నీ



బయటపెడతానని చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి పద్మావతి పురం మాజీ సర్పంచ్, టీడీపీ నేత గణపతి నాయుడు వార్నింగ్ ఇచ్చాడు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరుల సమావేశంలో గణపతి నాయుడు మాట్లాడారు. తనకు ఎటువంటి సంబంధం లేని భూమిని తాను ఆక్రమించుకున్నట్లు ఓ దినపత్రికలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి రాయించడం బాధాకరమన్నారు. నేను రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకుంటున్నానని, నన్ను కానీ గోకితే గత వైసీపీ ప్రభుత్వంలో చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చేసిన కబ్జాలన్నీ బయటపెడతానని చెవిరెడ్డిని గణపతి నాయుడు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మాజీ సర్పంచ్ ప్రదీప్‌కుమార్‌రెడ్డి, దుర్గా ప్రసాద్, రఘుపతి, సునీల్, రాజేంద్ర,పాల్గొన్నారు.

## పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు

### ఇంటి స్థలాలు ఇవ్వాలి – సీపీఐ ధర్నా

**పుత్తూరు రూరల్, జూన్ 2 ప్రభాతవార్త:**



పుత్తూరు సీపీఐ రాష్ట్ర సమితి పిలుపు మేరకు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద పట్టణ కార్యదర్శి డి.మహేష్ ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథులుగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి చలపతి, కత్తి రవి పాల్గొని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం వచ్చి సంవత్సరం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకపోవడం దారుణమని వెంటనే చెప్పిన వాగ్దానాలను అమలు పరచాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం చెప్పినటువంటి సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వరులుకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి గోపి, కృష్ణారెడ్డి, మనీ హమాలి వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి రమణ, అభి, లబ్ధిదారులు రోజా, మీన, సుబ్బమ్మ, సూరి, రాము తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా వసంతోత్సవం

**పుత్తూరు రూరల్, జూన్ 2 ప్రభాతవార్త:**



పుత్తూరు మండల పరిధిలోని ఉత్తరపు కండ్రిగ గ్రామంలో వెలసిన గ్రామదేవత శ్రీ అంకాళపరమేశ్వరి తిరుణాళ్ల వసంతోత్సవంతో ముగిసింది. ఉదయం ఆలయంలోని విశేష అభిషేకాలు, అలంకరణలు చేశారు. అనంతరం అమ్మవారిని మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. యువకులు పసుపు నీళ్లు చల్లుకుంటూ వసంతోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భక్తులు అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**పుత్తూరు రూరల్, జూన్ 2 ప్రభాతవార్త:**



తిరుపతి జిల్లాలోని పుత్తూరు, సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, శ్రీకాళహస్తి, రేణిగుంట, తాటితోపు తదితర బ్రాహ్మణ సంఘాలు అన్నిటిని కలుపుతూ బ్రాహ్మణులందరూ ఐక్యంగా ఒక తాటి మీదకు రావాలని సంకల్పంతో రాష్ట్రయువజన అధ్యక్షుడు, తిరుపతి జిల్లాలో బ్రాహ్మణ సంఘాల సేవా సమితి ప్రధాన కార్యదర్శి శ్రీ వేదం హరిప్రసాద్ గతం ఫిబ్రవరి నుంచి నియోజకవర్గాల్లో పర్యటించే బ్రాహ్మణులను ఐక్యంగా చేసి ఒక తాటి మీదకు తీసుకొచ్చి ఈ నాడు శ్రీకాళహస్తి వేదికగా శ్రీకాళహస్తి బ్రాహ్మణ భవనంలో ప్రమాణస్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రప్రధాన కార్యదర్శి వాసుదేవరావు, క్రమశిక్షణ మండలి అధ్యక్షులు కొత్తపల్లి అజయ్ కుమార్, స్థానిక శ్రీకాళహస్తి బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ప్రకాశం, పుత్తూరు బ్రాహ్మణ సంఘం గౌరవాధ్యక్షులు ఆలూరు రామకృష్ణలు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూతనంగా ఎన్నుకున్న బ్రాహ్మణ సంఘాలు ప్రతినిధులను ప్రమాణ స్వీకారం చేయించారు. పుత్తూరు పట్టణం నుంచి అధికార ప్రతినిధిగా కె.బాలాజీశర్మను, సంయుక్త కార్యదర్శిగా కె.బాలాజీరావు, మహిళా విభాగానికి సంబంధించి టి.కె.లలిత, కలంచేరి గీతలు నియమించారు.

## బర్డ్స్‌కు పూర్వ వైభవం

### - రిమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ జె. ప్రకాష్‌రెడ్డి

**తిరుపతి హెల్త్, జూన్ 2 ప్రభాతవార్త :**



మీ రాకతో బర్డ్స్ ఆస్పత్రికి పూర్వ వైభవం తప్పక వస్తుందని బర్డ్స్ డైరెక్టర్‌గా నూతనంగా నియమితులై బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ జగదీష్‌తో రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్సెస్ (రిమ్స్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జె. ప్రకాష్‌రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం ఆస్పత్రిలోని ఆయన చాంబర్‌లో ప్రిన్సిపాల్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువ, పుష్పగుచ్చంతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మానవీయ విలువలను మహోన్నత వ్యక్తి, మానవ సేవే మాధవ సేవ అని భావించి తన వృత్తిని పట్టుదల, నిబద్ధతతో బర్డ్ ఆస్పత్రిని ఉన్నత శిఖరాలకు తీసుకెళతారని ఆకాక్షిస్తున్నానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తోపాటు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## స్నేహబంధం... ఎంత మధురం

**రేణిగుంట జూన్ 2 ప్రభాతవార్త**



స్నేహబంధము... ఎంత మధురం అది చెరిగిపోదు తరిగిపోదు జీవితాంతము అంటూ రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాలలో 2005 2009 బ్యాచ్ నందు విద్యను అభ్యసించిన విద్యార్థినులు మంగళవారం పాఠశాలలో కలుసుకొని చదువుకున్న కాలం నాటి మధురస్మృతులను గుర్తు తెచ్చుకున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపి అప్పటి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయినితో ఉల్లాసంగా గడిపారు. మధ్యాహ్నం అందరూ ఒకే చోట కూర్చుని సహపంక్తి భోజనాలు చేశారు. విద్యార్థులు తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. పూల బొకేలు, చిరు బహుమతులు, మిఠాయి బాక్సులు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. పూర్వ ఉపాధ్యాయులు ధనలక్ష్మి, సుజాత, పద్మజ, ముని రేణుక, సుగీత, జ్యోతి, విశ్రాంత ప్రధానోపాధ్యాయురాలు విష్ణువర్ధనం పూర్వ విద్యార్థులు విద్యార్థులు పి. ఈశ్వరమ్మ, స్నేహప్రియ, ఏ. కవిత, శ్వేత, దేవిక, గాడి లింగమ్మ, ఆశ, షాహిద, వై. భారతి వీణ, వి. నాగవేణి, ఎం. యామిని, సోనియా, కె. బాను, టి. దుర్గ భవాని, ఎస్. వాణి, పి. లావణ్య, వి. పల్లవి, ధనలక్ష్మి, నందిని, రోజా, మల్లీశ్వరి తదితరులు చదువులమ్మ ఒడిలో సేద తీరారు.

## ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ యోగ చేయాలి

### - గ్రంథాలయ అధికారి అల్లిసెట్టి అంజయ్య



వెంకటగిరి, జూన్ 2 ప్రభాతవార్త: ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరు యోగ చేయాలని గ్రంథాలయ అధికారి అల్లిశెట్టి అంజయ్య తెలిపారు. పట్టణంలోని మహాత్మా గాంధీ గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమాల్లో భాగంగా విద్యార్థులకు యోగా మాస్టర్ సిద్దమ్మ ద్వారా చిన్నారుల చేత యోగ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండే యోగ చేయడం వల్ల జీవితాంతం ఆరోగ్యంగా ఉంటారనితెలిపారు. పలు రకాల యోగ విన్యాసాలను చేయించారు. బేసిక్ ఇంగ్లీష్‌ని కూడా విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకురాలు తాటిశెట్టి లీలావతి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పాము కాటుకు గురైన రైతు

కోట, జూన్ 2 ప్రభాతవార్త: మండలం కోత్తపట్నం గ్రామానికి చెందిన రైతు వెంకటేశ్వర్లు సోమవారం తన పొలంలో పని చేస్తుండగా పాము కాటుకు గురైయ్యాడు. ఆమేరకు వెంకటేశ్వర్లు పాము కరిచిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలిపారు. దీంతో కుటుంభ సభ్యులు కోట ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చి ప్రథమ చికిత్స చేయించారు. అనంతం మురుగైన వైద్యం కొరకు గూడూరుకి తరలించారు.

**20 వైకాపాలో చేరిక:**

చిట్టమూరు మండలం వెల్లురు గ్రామానికి చెందిన యూవత్ 20 మంది సోమవారం కోట మండలం విద్యానగర్‌లోని నేదురుమల్లి సుబ్బారామిరెడ్డి కళాభవన్‌లో జరిగిన కార్యకర్తల సమావేశం జరిగింది. చిట్టమూరు మండల వైకాపా కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆ యువకులను తీసుకొచ్చి ఎమ్మెల్సీ మేరిగమురళిధర్ సమక్షంలో వైకాపా కండువా కప్పుకున్నారు.

## జనసేన సభ్యత్వ కిట్స్ పంపిణి



గూడూరు, జూన్ 2 ప్రభాతవార్త : నియోజకవర్గ జనసేన పట్టణ కమిటీ ఆధ్వర్యంలో క్రియాశీలక పంపిణీ చేయడం జరిగింది. జనసేన పార్టీ చేపట్టిన క్రియాశీలక కార్యకర్తల సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగస్వాములు అయిన క్రియా వాలింటీర్‌లకు సభ్యత్వం కిట్‌లను గూడూరులోని సి.ఆర్.రెడ్డి కళ్యాణ మండపం నందు జనసేన కేంద్ర కార్యాలయం ఆదేశాలు మేరకు వాలంటీర్లకు అందజేశారు. దశాబ్ద కాలం పాటు జనసేన జెండా పట్టి గ్రామస్థాయిలో పార్టీ బలోపేతానికి కష్టపడిన జన సైనికుల బాగోగులు వారి కుటుంబాలకి ఒక రక్షణ కల్పించే విధంగా జనసేనాని పవన్ కళ్యాణ్ ఒక మంచి ఆలోచన అని అన్నారు. గూడూరు నియోజకవర్గంలో 3252 సభ్యత్వాలను నమోదు చేయించిన 55 మంది క్రియాశీలక వాలం టీర్లుగా పనిచేయడం నిజంగా ఎంతో గర్వంగా ఉంది.

## వ్యవసాయ రంగంలో అధునాతన పద్ధతులు



వెంకటగిరి, జూన్ 2 ప్రభాతవార్త: వ్యవసాయ రంగంలో రైతులు అధునాతన పద్ధతులు పాటించాలని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి డాక్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజీవన జాతీయ వరి పరిశోదన సంస్థ శాస్త్రవేత్తలు మండలంలోని పాపమాంబపురం, అమ్మపాలెం గ్రామాలలో వికసిత కృషి సంకల్ప అభియాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారతీయ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలతో కలిసి రైతులతో పరస్పర ముఖాముఖి ప్రత్యక్ష పరస్పర చేర్చా కార్యక్రమాలను సదస్సులను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే, శాస్త్రవేత్తలు ఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ మరియు ఉద్యాన అధికారులు, రైతులు పాల్గొన్నారు.

## వర్షాకాలం వచ్చే సమస్యలపై సమావేశం



వాకాడు, జూన్ 2 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయం వాకాడు మండలం నందు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు సోమ వారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు. రాబోవు వర్షాకాలం నందు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వాళ్లకి ఆదేశించారు. వచ్చేటటువంటి వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉన్నందున గ్రామాలని పరిశుభ్రంగా ఉంచాలని, ఎక్కడ కూడా నీరు నిలబడే విధంగా మరుగులు ఉంచకుండా చూడాలని మరియు వర్షాకాలంలో ప్రబలే అంటువ్యాధులుపై అవగాహన ఉంచి, నివారణ చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సర్వేలు త్వరగా పూర్తిచేసి జూన్ 21 లోపు (జాతీయ యోగ దినోత్సవం) గ్రామాలను సంసిద్ధం చేయాలని మరియు జూన్ 5,2025 నాడు వనంమనం పచ్చ తోరణం కార్యక్రమం సందర్భంగా రోడ్డుకు ఇరువైపులా చెట్లు నాటాలని సిబ్బందికి ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ ఎంపీడీవో ఎస్.ఉమామహేశ్వరరావు, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గూడు కాలిబూడదాయే...బతుకు బరువాయే...!

### -ఆపన్న హస్తం కోసం ఎదురుచూపు



ఎ.కొత్తకోట(చౌడేపల్లి), జూన్ 2 ప్రభాతవార్త: చిన్న వాడాకు గూడు అగ్నికి ఆహుతి అయ్యి ంది... రోడ్డున పడ్డ వృద్దుడు ఆపన్న హస్తం కోసం ఎదురు చూస్తున్నాడు...కాటికి కాలు చూపిన వయసులో మతిస్థిమితం లేని కూతుర్ని పోషించుకొంటూ కాలానీడ్చుతున్న వృద్దుడికి బతుకు బరువై పరపంచన పడున్నాడు... మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోటకు చెందిన వెంకట్రమణ(85) ప్రభుత్వ మందించే ఫించనుపై జీవిస్తున్నాడు. అతనికి మతిస్థిమితం లేని సుమిత్ర అనే కుమార్తె వుంది. ఈక్రమంలో తనకున్న పూరిగుడిసెలో వంట వండుతుండగా మంటలు ఎగసిపడి గుడిసెకు నిప్పంటుకొంది. గ్రామస్తులందరూ వచ్చి ఆర్పేలోపు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఇంట్లోవున్న దుస్తులు, ఫించను నగదుతోపాటు రేషన్, ఆధార్‌కార్డులన్నీ కాలి బూడిదయ్యాయని వృద్దుడు వాపోయాడు. ఉన్న గూడు కాలి పోవడంతో పొట్ట నింపుకొనేందుకు ఇంటింటికీ వెళ్ళి బువ్వ పెట్టమని యాచిస్తున్నాడు. దయగల దాతలు వారిని ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

## కన్నుల విందుగా కళ్యాణోత్సవం

యాదమరి, జూన్ 2 ప్రభాతవార్త: యాదమరి శ్రీ వరదరాజస్వామి బ్రహ్మోత్స వాల్లో భాగంగా సోమవారం కళ్యాణోత్సవం వైభవంగా ముగిసింది. శ్రీవరదరాజస్వామి ఆలయంలో సోమవారం ఉదయం వేద పండితులు మూలవర్లకు పుష్ప కైంకర్యం నిర్వహించి అభిషేకం చేశారు. అనంతరం స్వామి వారిని భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవ విగ్రహాలను సుందరంగా పుష్పాలతో అలంకరించి హనుమంత వాహనంపై మాడ వీధుల్లో ఊరేగించారు. సాయంత్రం స్వామి వారిని నాచ్చియార్ తిరుక్కోళం నిర్వహించి అనంతరం శ్రీదేవి భూదేవి సమేత వరదరాజుల స్వామి వారిని కనులవిందుగా కళ్యాణోత్సవం నిర్వహించారు. రాత్రి పెళ్ళి కొడుకుగా ఏనుగు వాహనంపై మాడ వీధుల్లో విహరించారు. స్వాముల రాకతో భక్తులు కర్పూర హారతులతో స్వాగతించి తమ మొక్కులను తీర్చుకున్నారు.

**నేడు రథోత్సవం**

యాదమరి శ్రీవరదరాజస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రథోత్సవం వైభవంగా జరుగనుంది. రథోత్సవంను వైభవంగా నిర్వహించి పూర్తి చేయడానికి బ్రహ్మోత్సవ నిర్వాహక కమిటీ సభ్యులు ఏర్పాటు పూర్తి చేశారు. యాదమరి రైతు సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ రథోత్సవానికి యాదమరి, దాని పరిసర ప్రాంతాల ప్రజలతో పాటు తమిళనాడు, కర్నాటక రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున భక్తులు తరలిరానున్నారు.

## ఆగమ సలహాదారుగా వేదిక్ ఆచార్యులు



తిరుపతి విద్య, జూన్ 2 ప్రభాతవార్త : టీటీడీ వైఖానస ఆగమ సలహాదారులుగా ఎస్వీ వేదిక్ వర్సిటీ వైఖానస విభాగ సహాయ ఆచార్యులు డీఆర్ పరాశరం భావనారాయణ నియమితులయ్యారు. ఈ సందర్భంగా వర్సిటీలో సోమవారం రిజిస్ట్రార్ డాక్టర్ పి భాస్కరుడు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.

## ఎన్నికల ముందు వాగ్దానాలు... ఎన్నికల తరువాత ప్రగల్భాలు



శ్రీకాళహస్తి, జూన్ 2 ప్రభాతవార్త : ఎన్నికల ముందు మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన కూటవి ప్రభుత్వం గద్దె ఎక్కిన తరువాత ప్రజలను పూర్తిగా విస్మరించిందని వైసిపి తిరుపతి జిల్లా పరిశీలకులు మేడా రఘునాథరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా సోమవారం శ్రీకాళహస్తి నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ ఆత్మీయ సమావేశం మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన తిరుపతి జిల్లా పార్లమెంట్ పరిశీలకులు మేడ రఘునాథరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో మోసపూరిత వాగ్దానాలతో ప్రజల్ని మభ్యపెట్టి గెలిచిన తరువాత పథకాలను అమలు చేయకుండా ప్రజల్ని వెన్నుపోటు పొడిచిన టిడిపి ప్రభుత్వ మోసపూరిత విధానానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తూ, ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ జిల్లా కలెక్టరేట్ వద్ద జూన్ 4న వెన్నుపోటుదినం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పిలుపునిచ్చారు. మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనంరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక శ్రీకాళహస్తిలో వైకాపా నాయకులను టార్గెట్ చేసుకొని కుట్రలు, కుతంత్రాలు చేస్తూ భయానక వాతావరణం సృష్టించాలని చూస్తున్నారన్నారు. ఈ నెల 4న జరిగేవెన్నుపోటు దినోత్సవంను విజయ వంతం చేసి శ్రీకాళహస్తి పాలన పట్ల ప్రజల వ్యతిరేకతను చాటి చెప్పాలని అందుకు ప్రతి వైకాపా మద్దతుదారుని సమీకరించాలని మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు. ఈ సమావేశంలో శ్రీకాళహస్తీశ్వ రాలయ దేవస్థానం మాజీ ఛైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు, బర్రిసుదర్శనం రెడ్డి, వయ్యాల కృష్ణారెడ్డి, చెవిరెడ్డి మధుసూధనంరెడ్డి, కూనాటి రమణయ్యయాదవ్, కిఫోర్‌రెడ్డి, గంగారి రమేష్, రేణిగుంట ఎంపిపి హరిప్రసాద్‌రెడ్డి, పగడాల రాజు,ప్రభాకర్, కోగిల సుబ్రమణ్యం, కోవిచంద్రయ్య నాయుడు, డిల్లిబాబు, జనార్ధన్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఈ నెల 4న నిర్వహించే వెన్నుపోటు దినోత్సవానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు.

## శ్రీవారి సుప్రభాతసేవలో సోనూసూద్



తిరుమల,జూన్ 2 ప్రభాతవార్తప్రతినిధి: సినీనటుడు,సేవాతత్పరుడు సోనూ సూద్ తన కుటుంబంతో కలసి సోమవారం వేకువజామున శ్రీవేంకటేశ్వర స్వామిని సుప్రభాతసేవలో దర్శించుకున్నారు. 25సంవత్సరాల తరువాత కుటుంబంతో కలసి తిరుమలకు వచ్చానని, స్వామివారి దర్శనంతో సంతోషం చెందారు.

## శిల్పారామంలో అలరించిన నృత్య ప్రదర్శనలు

తిరుచానూరు, జూన్ 2 ప్రభాతవార్త : తిరుచానూరు శిల్పారామంలో సాంస్కృతి కార్యక్రమాలు చూపరులను అలరించింది. శిల్పారామంలో ఏవో సుధాకర్ సమాచారం మేరకు సోమవారం సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను ఆకట్టుకుంది. పాకాల మండలం పాటూరు గ్రామానికి చెందినడాన్స్ మాస్టర్ మాస్టర్ కె.హేమంత, సాయి వేద శిక్షణాలయం వారిచే వివిధ కీర్తనలకు నృత్య ప్రదర్శన చేపట్టారు. ఏకదంతాయ గానంతో మొదలై, పుష్పాంజలి, లాలి లాలి, మొదలగు కీర్తనలకు కళాకారులు నృత్య ప్రదర్శన చేశారు. కళాకారులు లోకిత ధన్విత, యహస్వినీ, యశస్వృత, రక్షిత, సౌమ్య, దేదీప్య, దేవీప్రియ, పోక్షిత, సహస్ర, రిక్షిత్ తదితరులు నృత్యం చేసి ఆకట్టుకున్నారు. ప్రేక్షకుల చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. అనంతరం శిల్పారామం ఏఓ కళాకారులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో నృత్య శిక్షకుడు హేమంత, సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ డోర్ డెలివరీ రద్దు చేయడం తగదు



కోట, జూన్ 2 ప్రభాతవార్త : రేషన్ డోర్ డెలివరీ విధానాన్ని రద్దు చేయడమంటే పేదలను దోపిడీ చేయడానికి మళ్లీ ద్వారాలు తెరిచినట్లే అని కోట మండల వైసీపీ అధ్యక్షుడు పలగాటి సంపత్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తీరును తీవ్రంగా విమర్శించారు. గతంలో రేషన్ దుకాణాల్లో సరుకులు ఎప్పుడిస్తారో తెలియక ప్రజలు పనులు మానుకొని నిరీక్షించేవారని చెప్పారు. పాలన సంస్కరణలలో భాగంగా ఇంటి వద్దకే రేషన్ అందించే విధానాన్ని గత వైసీపీ ప్రభుత్వం ప్రారంభించి దోపిడీకి అడ్డుకట్ట వేసిందన్నారు. ఎప్పటి నుంచో డీలర్ల వ్యవస్థ ఉందని, ఆ వ్యవస్థలో లోపాలు ఉన్నాయన్న ఉద్దేశంతో తమ ప్రభుత్వం రేషన్ బండి ద్వారా ఇంటింటికి సరుకులు అందజేసినట్లు తెలిపారు.

## విద్యుత్ లేక..గ్రీవెన్స్‌డేలో అధికారులకు ఇబ్బందులు

కోట, జూన్ 2 ప్రభాతవార్త: రాష్ట్రప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహి స్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ శాఖల అధికారులు హాజరవుతుంటారు. ఈ నేపథ్యంలో సోమవారం కోట మండల తహశీల్దార్ కార్యాలయంలో విద్యుత్ సరఫరా గంటల తరబడి నిలిచిపోవడంతో అధికారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కోటలో ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఈ సమస్య తలెత్తింది. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను అధికారులు ఆన్‌లైన్ చేయాల్సి ఉండగా, ఆ కార్యక్రమం నిలిచిపోయింది. దాంతోపాటు అధికారులు కూడా ఉక్కపోతతో ఇబ్బందులకు గురయ్యారు. ఈ విషయంపై సబ్ స్టేషన్ ఎడి చిన్నయ్యను 'ప్రభాతవార్త' వివరణ కోరగా, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

## గూడలిలో చినుకు పడితే చీకటే

కోట, జూన్ 2 ప్రభాతవార్త: మండలం గూడలి గ్రామంలోని పాత అరుంధతీయ వాడలో చిన్నపాటి చినుకు రాలినా, గాలి సోకినా విద్యుత్ సరఫరా నిలిచిపోతుంది. ఈ నేపథ్యంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు నెలలుగా ఈ సమస్య ఉండటంతో సంబంధిత అధికారులు పట్టించు కోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎండకు ఉక్కపోత, ఇళ్లలో దోమల మోత, ఇంట్లో బయట ఉండలేక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇదే విషయమై కోట సబ్ స్టేషన్ ఎడి చిన్నయ్యను 'ప్రభాతవార్త' వివరణ కోరగా, అక్కడికి ఏఇని పంపించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు.

## సూపర్ సిక్స్ పథకాలను ప్రభుత్వం అమలు చేయాలి




వెంకటగిరి, జూన్ 2 ప్రభాతవార్త : ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ ఆమెను వెంటనే అమలు చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాధాకృష్ణ తెలిపారు. సిపిఐ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా అర్బన్ ప్రాంతంలో 2 సెంట్లు ఇంటి జాగా, రూరల్ ప్రాంతంలో 3 సెంట్లు ఇంటి జాగా ఇల్లు నిర్మించుకోవడానికి 5 లక్షల రూపాయల రుణ సదుపాయం కల్పించాలని తాసిల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీలు అమలు చేయాలని కోరారు. వెంకటగిరి ఎమ్మార్వో ఆఫీస్ ఎదుట జరిగిన ధర్నా చేశారు.ప్రజా సమస్యలను పరిష్కరించాలని కూటమీ ప్రభుత్వం ప్రజలకు చేస్తానన్న హామీలను వెంటనే చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి పల్లిపట్టి బాలకృష్ణ. స్ట్రీట్ వెండర్స్ నాయకులు టౌన్ అధ్యక్షులు, నరసింహులు సెక్రెటరీ మునీంద్ర, సిపిఐ నాయకులు అంకయ్య, కార్మికులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

## వీరమరణం చెందిన జవాన్లకు ఘన నివాళి



బాలాయపల్లి, జూన్ 2 ప్రభాతవార్త : నిండలి గ్రామ పంచాయతీ సర్పంచ్ అయిన యల్లాంటి కిష్టయ్య ఆధ్వర్యంలో గ్రామంలో ప్రభుత్వ పాఠశాల నుండి సచివాలయం వరకు తిరంగా ర్యాలీని నిర్వహించిన వీర మరణం పొందిన జవాన్లకు నివాళులర్పించారు. అన్ని వర్గాల ప్రజలు కలిసి జాతీయ జెండాను చేతబూని భారత సైనికులకు మద్దతుగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కొందూరు వెంకట సుధాకర్ రాజుగా మాట్లాడుతూ కాశ్మీర్లో పెహల్గామ్‌లో పాక్ ప్రేరేపిత ఉగ్రవాదుల దాడి ప్రతీకారంగా పాకిస్తాన్లోని ఉగ్రవాద స్థావరాలను పదుల సంఖ్యలో ఉగ్రవాదులను హతమార్చి భారతదేశానికి గొప్ప విజయం అందించిన మన త్రివిధ దళాధిపతులైన ఆర్మీ, ఎయిర్ ఫోర్స్, నేవీ సైనికుల ధైర్య సాహసాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం, గ్రామ వైద్య, అంగన్వాడి సిబ్బంది, కొండూరు నరసింహారాజు, కొండూరు మధురాజు, యల్లంరాజు గోపాల్ రాజు, దేరంగుల శ్రీనివాసులు, యల్లంరాజు మోహన్ రాజు, కొండూరు కళింగరాజు, ముప్పాళ్ళ వెంకటరాజు, ముప్పాళ్ళ ప్రభాకర్ రాజు, కొండూరు శ్రీనివాసులు రాజు, చెరుకూరు వెంకటేశ్వర్లు నారిశక్తి వల్లెం మరియమ్మ, మారాసి జయమ్మ, తోకలపూడి కృష్ణమ్మ, కొండూరు మంగమ్మ, ముప్పాళ్ళ వెంకటసుబ్బమ్మ, కొండూరు నాగభూషణమ్మ, ముప్పాళ్ళ రాజేశ్వరమ్మ, పొదుపు వివోఏ కొండూరు వసంతమ్మ, యువత, విద్యార్థులు మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఇళ్ల స్థలాలు కేటాయించే వరకు పోరాటాలు : సిపిఐ



గూడూరు, జూన్ 2 ప్రభాతవార్త: పేదలకు ఇళ్ల స్థలాలు దక్కే వరకు సీపీఐ పోరాటం సాగిస్తుందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం డిఎఓ శిరీషకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, శశి కుమార్ మాట్లాడుతూ ఇల్లు లేని పేదలకు పట్టణంలో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు స్థలం ఇవ్వాలన్నారు. ఇంటి నిర్మాణం కోసం 5 లక్షల రూపాయలను ప్రభుత్వం వెంటనే మంజూరు చేయాలనీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, సిపిఐ నియోజక వర్గ కార్యదర్శి శశి కుమార్, ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం జిల్లా నాయకులు సి.వి.ఆర్ కుమార్, ఏఐటియూసి నియోజకవర్గ కార్యదర్శి నారాయణ, కె.రాజా, కరిముల్లా, నరసింహులు శెట్టి, అబ్దుల్ బాషా, కృష్ణ, ప్రజా నాట్యమండలి జిల్లా నాయకులు టి.మస్తానయ్య, సీను, వెంకట్రయ్య రమణమ్మ, ఆఫ్రీన్, సలీమా, ఉష, మమత, ఏఐఎస్ఎఫ్ యశ్వంత, దీపు, ప్రణయ్ కుమార్, శ్రీవంతు, సతీష్‌లు పాల్గొన్నారు.

## జిడి రోడ్డుపై చెట్లు నరికివేత



కోట,జూన్ 2 ప్రభాతవార్త : మండల పరిధిలోని చంద్రశేఖపురం, విద్యానగర్ జిడి రోడ్డు పక్కన ఏన్నో సంత్సరాల నుంచి ఉన్న చెట్లును ఆర్అండ్‌బి అధికారులు సోమవారం నరికి వేశారు. దీంతో ప్రజలు ఆశాఖ అధికారులు వ్యహరించిన తీరుపై మండి పడ్డారు. పాదచారులు, ద్వీచక్రవాహనదారులకు ఎంతో నీడ వసతిని కల్పిస్తున్న చెట్లును నరకడం పట్ల ప్రజల అసహనం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ తీగలకు చెట్లు కొమ్మలు అడ్డ తగులుతున్నాయనే నేపపంతో నీడను ఇచ్చి చేట్లును తోలగించడం మంచి పద్దతి కాదన్నారు. విద్యుత్ తీగలకు కొమ్మలు అడ్డు తగిలితే కొమ్మలను తొలగించాలి కానీ చెట్లును నరకడం ఏమిటిని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## హస్త కళల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వండి

### - చైర్మన్ హరి ప్రసాదం, జనసేన నేత కృష్ణయ్య



వెంకటగిరి, జూన్ 2 ప్రభాతవార్త: హస్త కళల అభివృద్ధికి తోడ్పాటు ఇవ్వాలని నూతన చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ హరిప్రసాదను కాపు బలిజ సంక్షేమ సంఘం ట్రస్ట్ అధ్యక్షులు తోట కృష్ణయ్య కోరారు. విజయవాడలో రాష్ట్ర హస్తకళ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షులు మరియు జనసేన పిఎస్సి సభ్యులు అయినటువంటి డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ రాష్ట్ర హస్తకళ అభివృద్ధి చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఆయనకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన త్వరలో వెంకటగిరిలో పర్యటిస్తానని ఆయన తెలిపారు. త్వరలోనే వెంకటగిరికి వస్తానని పరిశీలిస్తామని ఆయన చెప్పడం చాలా సంతోషంగా ఉందన్నారు.

## ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలి



వెంకటగిరి, జూన్ 2 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలు అందించాలని 14వవార్డు కౌన్సిలర్, వెంకటగిరి నియోజకవర్గ వై.యస్. ఆర్.సి.పి. పార్టీ ఆర్.టి.ఐ. విభాగపు అధ్యక్షుడు ఆరి శంకరయ్య కోరారు. నియోజకవర్గ వై.యస్. ఆర్.సి.పి.పార్టీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రభుత్వ ఆసుపత్రి పిహెచ్.సి. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు 12 వ వార్డు మల్లమ్మ గుడి దగ్గర, 23వ వార్డు బూసితోట నందుగల యు.పి.హెచ్.సి. కేంద్రలను పరిశీలించారు. పి.హెచ్.సి. కేంద్రలలో రోగులు లేక ఖాళీగా వున్నాయి. ఇక్కడ లభించే సేవలు ప్రజలకు తెలియకపోవడం వలన రోగులు ప్రైవేట్ ఆసుపత్రిలో డబ్బులు వెచ్చించి వైద్యం చేసుకుంటున్నారు. కాన్పులు చేసే లేడి డాక్టర్ లేకపోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇందులో భాగంగా 14 వ వార్డు కౌన్సిలర్ ఆరి శంకరయ్య ప్రజాల దగ్గరనుండి అర్జీలు స్వీకరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# మోటార్లు,స్టార్టర్లు దొంగల ముఠా ఆరెస్టు

## 795కిలోల రాగివైరు స్వాధీనం



శ్రీకాళహస్తి రూరల్,జూన్ 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మోటార్లు,స్టార్టర్లు చోరి చేయటం ట్రాన్స్‌ఫార్మర్లు పగల గొట్టిన కేసులో నిందితుల ముఠాను ఆరెస్టు చేసి వారి నుంచి చోరీ జరిగిన సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు డివైయస్‌పి శ్రీనివాసరావు సోమవారం విలేకరుల సమావేశంలో ప్రకటించారు.గత నెల రోజులుగా శ్రీకాళహస్తి,ఏర్పేడు మండలాల్లోని గ్రామాల్లో వరుస చోరీలతో పోలీసులు అప్రమత్తమయ్యారు.పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేసిన వివరాలను డివైయస్‌పి వివరిస్తూ ఏర్పేడులో 6శ్రీకాళహస్తి రూరల్‌లో,గాజుల మాండ్యం,రేణిగుంటల్లో ఒక్కొక్క కేసు నమోదు చేసినట్లు వివరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రైతులకు సంబంధించిన వ్యవసాయ పొలాల్లో ఏర్పాటు చేసిన మోటార్లు,స్టార్టర్లు చోరికి సంబంధించి జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు ప్రత్యేక టీం ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారన్నారు.ఈ నేపధ్యంలో ఎక్కువ ఏర్పేడు మండలంలోని రైతులు నష్టపోయారు కాబట్టి ఏర్పేడు పోలీసుస్టేషన్ నుంచి ఓ ప్రత్యేక టీంను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఈ టీంలో ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి, గాజుల మాండ్యం సిఐ మంజునాథ్‌రెడ్డి ఎస్ఐ శ్రీకాంత్,ఎఎస్ఐ ధర్మసింగ్, పిసిలు మణి,మహేంద్రబాబు, అరుణ్, బాలకృష్ణ, శివలంగం, కార్తీక్‌లను నియమించుకొని గతంలో నేరాలతో సంబంధం ఉన్న ముఠా గురించి ఆరాతీసినట్లు వివరించారు. పట్టుబడ్డ ముఠా ఏడాదిగా ఈ కార్యక్రమాల్లో ఉన్నట్లు గుర్తించామన్నారు.వీరు పగలు సీన్ చూసుకోవటం రాత్రి నేరానికి పాల్పడినట్లు గుర్తించామన్నారు. ఈ ముఠా సుమారు 50 ట్రాన్స్‌ఫార్మర్లు 150మోటార్‌స్టార్టర్లు ధ్వంసం చేసినట్లు తమ విచారణలో గుర్తించామన్నారు. దాంతో రైతులు తీవ్ర నష్టానికి గురయ్యారని వ్యవసాయ పనుల్లో జాప్యానికి గురై నష్టపోయినట్లు డివైయస్‌పి శ్రీనివాసరావు వివరించారు.

**నేరస్థులను అదుపులో తీసుకున్న తీరు ...**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మోటార్స్,స్టార్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు దొంగతనానికి సంబంధించిన దొంగలను పట్టుకోవటానికి నియమించిన టీం ఏర్పేడు సిఐ శ్రీకాంత్‌రెడ్డి సబ్‌ఇన్స్పెక్టర్ ఎన్.శ్రీకాంత్‌రెడ్డిలు విచారణ జరుపుతుండగా ఏర్పేడు మండలం వికృతమాల సమీపంలోని టిసిఎల్ సర్కిల్ వద్ద ముగ్గురు ప్రధాన నిందితులను అదుపులో తీసుకున్నట్లు వివరించారు. అదుపులో తీసుకున్న వారిలో శ్రీకాళహస్తి మండలం ఎర్రగుడిపాడు గిరిజన కాలనీకి చెందిన కె.వెంకట్రామయ్య (45), కత్తిమణి (35) జెండా వెంకటేష్ అనే చిరంజీవి(45)లు పథకం ప్రకారం దొంగతనం చేసిన సొత్తును కొనుగోలు చేస్తున్న వారిని కూడా అదుపులో తీసుకున్నట్లు డివైయస్‌పి వివరించారు. తిరుపతికి చెందిన ఎస్‌కె ఖాదర్‌బాషా,సయ్యద్ వాజిద్‌హుసేన్,షేక్ బషీర్‌లతో పాటు శ్రీకాళహస్తికి చెందిన షేక్ హుస్సేన్, వెంకటగిరికి చెందిన స్నేత్నా గోపాల్ కృష్ణాలను అరెస్టు చేసినట్లు వివరించారు. 40 ట్రాన్స్‌పార్మర్లు, 77 స్టార్టర్లు రాగి వైరు 795కిలోలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. నిందితులను అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచినట్లు డివైయస్‌పి వివరించారు. రైతులకు సంబంధించిన బాధలను తొలగించిన పోలీసుల చొరవను జిల్లా ఎస్‌పి హర్షవర్ధన్‌రాజు అభినందించారు.వారికి రివార్డులు ఇవ్వాలని సిఫార్సు చేసినట్లు డివైయస్‌పి శ్రీనివాసరావు వివరించారు.

## రీ-సర్వే డీటీ మోహన్‌పై శాఖాపరమైన చర్యలు తీసుకోండి

### - జిల్లా కలెక్టర్‌కు ఎంపీపీ,వైస్ ఎంపీపీలు ఫిర్యాదు



తిరుపతి కలెక్టరేట్, జూన్ 2 ప్రభాతవార్త : తిరుపతి రూరల్ మండలం రీ-సర్వేయర్ డెప్యూటీ తహశీల్దార్ మోహన్ ప్రభుత్వ భూములు, హథీరాంజీ, బుగ్గమఠం భూములను సైతం భూ ఆక్రమణ దారులకు ధారాదత్తం చేస్తూ ఇష్టారాజ్యం ప్రవర్తిస్తున్నాడని అతనిపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చి జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌కు వారు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోహన్ ప్రతి రోజు ఉదయం నుంచి ద్విచక్రవాహనంపై తిరుగుతూ ప్రభుత్వ భూములు, కాలువలు, కుంటలు, బంజరు భూములు, హథీరాంజీ, బుగ్గమఠం భూములు ఎక్కడెక్కడా ఉన్నాయో తెలుసుకుని వాటి వివరాలను రియల్ ఎస్టేట్ వ్యాపారులు,భూ కబ్జాదారులకు అందజేస్తూ ఆ భూములను అందినకాడికి అమ్మివేస్తూ తన వాటాను వారి వద్దనుంచి తీసుకుంటున్నట్లు ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో బాధితులు తమ దృష్టికి తీసుకుని రావడం జరిగిందన్నారు. అతను చేస్తున్న అవినీతి, అక్రమాలపై కలెక్టర్ ప్రత్యేక దర్యాప్తు జరిపించి కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను వారు విజ్ఞప్తి చేశారు.


**SRIKALAHASTI MUNICIPALITY**

The Comissioner, Srikalahasti Invites Tender on e-Procurement platform from the "eligible contractors' for the following works

| IFB | Name of the work | No.of works | Estimate amount RS in Lakhs |
|---|---|---|---|
| IFB No: 36/2023-24 & 1 to 5/2025-26 Date:31.05.2025 | Desiltation of Drains | 6 works | 40.65 |
| TOTAL | | 6 works | 40.65 |

For particulars please contact Deputy Executive Engineer during office working hours (or) see e-procurement market place : https://tender.apeprocurement.govt.in

Sd/- Commissioner, Srikalahasti Municipality